
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
సోమవారం 25 ఆగస్టు 2025

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తుననట్లు తెలిపారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని చెప్పారు.



సర్టిఫికెట్ల పరిశీలనకు
సన్నాహాలు

ఎన్నో ఏళ్లు తరువాత కూటమి ప్రభుత్వం డీఎస్సీ-2025 నిర్వహించింది. శుక్రవారం రాత్రి మెరిట్ జాబితా ప్రభుత్వం విడుదల చేసింది. కాబోయే గురువులు ఎవరో ఇప్పటికే తెలిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉండాలి. తక్కువ సమయం ఉండడంతో వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఎంపికైన అభ్యర్థులు తమ సెల్‌ఫోన్‌కు వచ్చే మెసేజ్ వివరాల మేరకు సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందని విద్యా శాఖ అధికారులు తెలిపారు. అలాగే.. ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులు విద్యార్హత, కుల, ఆదాయం, స్థానికత(నేటివిటీ), దివ్యాంగులైతే వారి అర్హత ధ్రువపత్రాలు (సర్టిఫికెట్లు) పరిశీలన ఉంటుంది. ఎంతో కష్టపడి పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు ఏ ఒక్క సర్టిఫికెట్ చూపించకపోయినా చిక్కుల్లో పడడమే కాదు.. ఉద్యోగమే కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఉద్యోగానికి దరఖాస్తు చేసే సమయంలో ఏఏ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేశారో.. ఆ సర్టిఫికెట్లు పరిశీలనలో తప్పకుండా చూపించాలని కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శ్యామ్యూల్ పాల్ ఆంధ్రజ్యోతికి వివరించారు.

- రాయలసీమ వర్సిటీ, శ్రీరాఘవేంద్ర, శ్రీనివాస్ బీఎడ్ కళాశాలల్లో కేంద్రాలు
- 54 బృందాల ఏర్పాటు
- డీఎస్సీ అభ్యర్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలి
- సెల్‌ఫోన్‌కు వచ్చే మెసేజ్ మేరకు పరిశీలనకు హాజరు కావాలి

కర్నూలు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)లో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, నాన్ లాంగ్వేజ్ సబ్జెక్టులు భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, గణితం, సాంఘిక శాస్త్రం (సోషియల్ స్టడీస్), ఎస్జీటీ టీచర్లు, పీఈటీలు, టీజీటీ ఇంగ్లీష్.. ఇలా వివిధ సబ్జెక్టుల్లో 2,645 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ-2025 నిర్వహించింది. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఖాళీలు ఉండడంతో జిల్లా నుంచే కాకుండా నాన్ లోకల్ కేటగిరీలో ప్రతిభ చూపేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసి పరీక్షలు రాశారు. 53,787 మంది అభ్యర్థులు మెరిట్ జాబితా వచ్చింది. వీరిలో రిజర్వేషన్లు ప్రకారం ఒక్కో పోస్టుకు ఒకరిని చొప్పున 2,645 మంది రేపటి ఎంపికైన అభ్యర్థులు (సెలెక్టెడ్ లిస్ట్) జాబితాను ఆదివారం రాత్రి విడుదల చేసి అభ్యర్థులకు నేరుగా మెసేజ్‌లు పంపుతున్నట్లు తెలిసింది. విద్యాశాఖ నుంచి మెసెజ్ మేరకు అభ్యర్థులు ఇంటిమేషన్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకొని.. మెసేజ్‌లో పేర్కొన్న తేది, సమయంలో సబంధిత పరిశీలన కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో శ్యామ్యూల్ పాల్



సర్టిఫికెట్ల పరిశీలనకు 54 బృందాలు

కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎస్జీటీ అభ్యర్థులకు, నన్నూరు సమీపంలో మారుతి ఎస్టేట్ శ్రీరాఘవేంద్ర బీఎడ్ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) లాంగ్వేజ్ అభ్యర్థులకు, నన్నూరు సమీపంలో మారుతీ ఎస్టేట్-2లో ఉన్న శ్రీనివాస బీఎడ్ కళశాలలో స్కూల్ అసిస్టెంట్ నాన్-లాంగ్వేజ్ అభ్యర్థులకు పరిశీలన కేంద్రాలు ఏర్పాటు చేశారు. 54 బృందాలను ఎంపిక చేశారు. ఒక్కో బృందంలో మండల విద్యా అధికారి (ఎంఈవో), ప్రధానోపాధ్యాయుడు, డిప్యూటీ తహసీల్దారు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారు. ఆరు బృందాలను ఒక బ్లాక్‌గా విభజించి, ప్రతి బ్లాక్‌కు సాంఘిక సంక్షేమం, బీసీ, ఎస్టీ, సైనిక్ సంక్షేమ శాఖ ప్రతినిధులు కూడా ఉంటారు. దివ్యాంగుల అభ్యర్థులు వారి అంగవైకల్యం నిర్ధారణ కోసం మెడికల్ బోర్డుకు పంపుతారు. వినికిడి లోపం కలిగిన వారిని విశాఖ పంపించి ధ్రువీకరిస్తారని డీఈవో తెలిపారు. పరిశీలన కేంద్రాల్లో ఏర్పాట్లను ఆదివారం డీఈవో శ్యామ్యూల్‌పాల్ తనిఖీ చేశారు. పరిశీలన కేంద్రాలు ఏర్పాటు చేసిన వర్సిటీ క్యాంపస్‌లోకి అభ్యర్థితో పాటు సహాయకుడు ఒకరిని అనుమతిస్తారు. అవసరమైన తాగునీరు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు.

ఈ సర్టిఫికెట్లు తప్పనిసరి

విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, నేటివిటీ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.8లక్షలలోపు ఆదాయం ఉన్నట్లు ధ్రువీకరించే ఆదాయ ధ్రువపత్రంతో పాటు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్లు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుంది. అభ్యర్థులు వారి సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్ ప్రకారం ఆ తేదీన తేది, సమయానికి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కాకపోతే వారి అభ్యర్థిత్వం రద్దు చేసి, ఆ తరువాత మెరిట్ ఉన్న అభ్యర్థిని సర్టిఫికెట్ల పరిశీలను పిలుస్తారు. నిర్లక్ష్యం చేస్తే ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉండడంతో అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లతో నిర్దేశించిన తేదీన హాజరు కావాలని విద్యా శాఖ అధికారులు తెలిపారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పేదలకు వరం సీఎంఆర్ఎఫ్ పథకం అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో 13మందికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. ఆపద సమయంలో కర్నూలు నియోజక వర్గ ప్రజలను ఆదుకున్న సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులు అందుకున్న వారు మంత్రి టీజీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. షేక్ అబ్దుల్ అర్మాన్‌కు రూ.19,944, మరియమ్మకు రూ.65 వేలు, షేక్ షేకూన్‌కు రూ.61,572, మీసాల మాధవస్వామికి రూ.85వేలు, నజీర్‌అహ్మద్‌కు రూ.55 వేలు, రెహానాసుల్తాన్‌కు రూ.25,574, నీలమాధవరాయుడుకు రూ.1,19,574, రాజకుమార్ రెడ్డికి రూ.1,14,574, షేక్ ఖాజీబీకు రూ.1,04,196, సుబ్బరామయ్యకు రూ. 71,922, గౌండ అబ్దుల్ వహీద్‌కు రూ. 43,565, ఉప్పు రామపద్మజకు రూ.3,35,520 చెక్కులను అందజేశారు.

29న జిల్లాకు మంత్రులు

- ఉమ్మడి జిల్లా, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులపై వినతుల స్వీకరణ

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ నెల 29న జిల్లాకు రానున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు కర్నూలు నగరంలోని సునయన ఆడిటోరియంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లాలు, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులకు సంబంధించి మంత్రులకు వినతులను అందజేయవచ్చని తెలిపారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

సైకిల్ ర్యాలీని ప్రారంభించిన అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా



జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా

కర్నూలు క్రైం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్ కార్యక్రమంలో పాల్గొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అడిషనల్ ఎస్పీ హుస్సేన్‌పీరా సూచించారు. నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద ఆదివారం సన్ డే స్ ఆన్ సైకిల్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కొండారెడ్డి బురుజు నుంచి ప్రారంభమై పాత కంట్రోల్ రూమ్ కిడ్స్ వరల్డ్ మీదుగా రాజ్‌విహార్ వరకు చేరుకుని అక్కడి నుంచి తిరిగి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ సైక్లింగ్ ద్వారా పర్యావరణానికి హానీ కలగదన్నారు. ఆధునిక జీవన శైలిలో ద్విచక్రవాహనాలు, కార్లలో ప్రయాణించడం ఒక అలవాటుగా మారిందన్నారు. ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని సూచించారు. సైక్లింగ్ ద్వారా వాహన కాలుష్యం కూడా తగ్గుతుందని అన్నారు.

నేటి నుంచి వేరుశనగ గ్రేడింగ్ నిలిపివేత

- నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించం
- వ్యాపారులకు మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన హెచ్చరిక



మార్కెట్ యార్డ్‌లో వేరుశనగను గ్రేడింగ్ చేస్తున్న మహిళా కూలీలు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రైతులు విక్రయానికి తెచ్చిన వేరుశనగను అనధికారికంగా గ్రేడింగ్ చేయడాన్ని సోమవారం నుంచి నిలిపివేస్తున్నామని, ఎవరైనా వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించబోమని మార్కెట్‌యార్డు కార్యదర్శి కల్పన హెచ్చరించారు. ఆమె మాట్లాడుతూ రైతులను నష్టపరిచే పాసింగ్ విధానాన్ని స్వస్తిపలకాలన్నారు. పలు దఫాలుగా వ్యాపారులకు ఈ విధానాన్ని కొనసాగించవద్దని హెచ్చరించి సమయం ఇచ్చారన్నారు. రైతులు ఇంటి వద్దనే తమ వేరుశనగకు దిగుబడులను ఆరబెట్టుకొని మట్టి రాళ్లు లేకుండా మార్కెట్ కమిటీకి విక్రయానికి తీసుకొస్తే మంచి ధర లభిస్తుందని తెలిపారు. వ్యాపారులు మాత్రం కచ్చితంగా గ్రేడింగ్ విధానం ఉంటేనే తాము టెండర్లు వేస్తామని లేకపోతే కొనుగోలు చేయలేమంటూ ఖరాకండిగా తేల్చి చెబుతున్నారు. ఈ విషయంపై సోమవారం ఏం జరుగుతుందోనని ముందుగానే మార్కెట్ యార్డ్ అధికారులు సబ్ కలెక్టర్ పోలీసులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రేడింగ్ విధానాన్ని ఎత్తివేస్తారా?, కొనసాగిస్తారా? అన్న చర్చ జరుగుతోంది. గ్రేడింగ్ విధానం ఎత్తివేస్తే మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు.

జిల్లా రథసారథి ఎవరు?



- రేపు త్రీమెన్ కమిటీ సభ్యుల రాక
- ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో భేటీ
- టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడి ఎంపికపై అభిప్రాయాల సేకరణ
- అధిష్ఠానానికి ఆశావహుల జాబితా

కర్నూలు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీని సంస్థాగతంగా బలోపేతం దిశగా ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటలాంటే పార్టీ మరింత బలోపేతం చేసేందుకు అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్‌లు బలమైన నాయకత్వం ఎంపిక కోసం సన్నహాలు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు నాయకులకు నామినేటెడ్ పదవులు ఇచ్చారు. మిగిలిన నాయకులకు పార్టీ పదవులు ఇవ్వనున్నారు. క్షేత్రస్థాయి మెజార్టీ నాయకుల అభిప్రాయాల తీసుకొని జిల్లా రథ సారథులను ఎంపిక చేస్తారు. ప్రస్తుత కర్నూలు జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డినే కొనసాగిస్తారా..? లేదా కొత్త వారికి చాన్స్ ఇస్తారా..? జిల్లా అధ్యక్ష పీఠం ఆశిస్తున్న ఆశావహులు మెజార్టీ ఎంపీ, ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాల్లో బీజీగా ఉన్నారు. అదే క్రమంలో జిల్లా ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలు సహా ముఖ్య నాయకుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు అధిష్ఠానం నియమించిన త్రీమెన్ కమిటీ మంగళవారం జిల్లాకు రానుంది. దీంతో తెలుగు తమ్ముళ్లలో ఇప్పుడు అదే హాట్ టాపిక్‌గా మారింది.

గత ఎన్నికల ముందు విజయమే లక్ష్యంగా అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ పార్టీ బలోపేతం కోసం పార్లమెంట్ నియోజకవర్గాల (జిల్లాలు) అధ్యక్షుల మార్పు, సంస్థాగతంగా పార్టీ బలోపేతం దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాజకీయ విశ్లేషకుల అంచనాలకు అందని విధంగా కర్నూలు, నంద్యాల ఎంపీలు సహా 11 ఎమ్మెల్యేలను టీడీపీ, మిత్రపక్షం బీజేపీ ఒక స్థానంలో ఘన విజయం సాధించింది. 2004 తరువాత 20 ఏళ్లలో ఉమ్మడి జిల్లాలో టీడీపీ ఏకచత్రాధిపత్యం సాధించింది. కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తి అవుతుంది. మరో ఏడాదిన్నరలోపే మున్సిపాలిటీ, జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికలు రాబోతున్నాయి. దీంతో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా పార్లమెంట్ పార్టీ కమిటీల నియామకంపై అధినేత, సీఎం చంద్రబాబు, యువనేత, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లు దృష్టి పెట్టారు. ఈ కమిటీల ఏర్పాటు కోసం అధిష్ఠానం త్రిసభ్య కమిటీలను నియమించింది.

మిగతా 8వ పేజీలో



నేత్రదానం చూపు ప్రదానం

నేత్రదానం అంటే మరణించిన తర్వాత మరొకరికి కంటిచూపును అందించడం . సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. ఇంతటి ముఖ్యమైన కంటి చూపునకు నోచుకోక చీకట్లోనే గడుపుతున్న వారెందరో? ప్రతి ఒక్కరూ మరణానంతరం తమ కళ్లను అలాంటి వారికిదానం చేయగలిగితే చూపు ప్రసాదించడంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. వైద్యరంగంలో సాంకేతిక విప్లవం కారణంగా కార్నియా లోపంతో ఉన్న అంధులకు కంటి దానం ద్వారా మళ్లీ చూపు ఇవ్వడం సాధ్యమవుతుంది. చాలా మందికి సరైన అవగాహన లేక నేత్రదానం చేయడానికి ముందుకు రావడం లేదు. విద్యాధికులు, స్వచ్ఛంద సంస్థలు నేత్రదానంపై అవగాహన కల్పించాల్సిన అవసరముంది. నేటి నుంచి జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

నేత్రదానానికి అర్హులు: ఏవయస్సు వారైనా నేత్రదానం చేయవచ్చు. కళ్లజోడు పెట్టుకునేవారు. మధుమేహం, బీపీ, ఉబ్బసం వ్యాధులతో ఉన్న వారు.

నేత్రదానానికి అనర్హులు: కుక్క కాటు రేబిస్ వ్యాధితో చనిపోయిన వారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో చనిపోయినవారు. రెండు వారాలు వెంటిలేటర్‌పై ఉన్న వారు. క్యాన్సర్ వ్యాధితో ఎక్కువ కాలం స్పృహ లేకుండా ఉన్నవారు.

నేత్రాల సేకరణ ఇలా.. మరణించిన ఆరు గంటల లోపు నేత్రాలను తీయాల్సి ఉంటుంది. నేత్రదానం వలన కుటుంబ సభ్యులకు ఎటువంటి చార్జీలు ఉండవు. ఈ నేత్రాలను ఉచితంగా వైద్యుల బృందం వెళ్లి వారి దగ్గరనే సేకరిస్తారు. నేత్రదానం చేసిన వ్యక్తి నుంచి రక్త పరీక్షకు గానూ, 10మిలీలీటర్ల రక్తాన్ని తీస్తారు. శిక్షణ పొందిన టెక్నీషియన్లు స్టెరైల్ పద్ధతి ద్వారా కళ్లను బయటకు తీస్తారు. ఒక వ్యక్తి నేత్రాలను దానం చేయడంతో మరో ఇద్దరికి కంటి చూపు లభిస్తుంది.

- ఏటా 400 మందికి పైగా నేత్రదానం
- అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- నేత్రదానంతో ఎందరో జీవితాల్లో వెలుగులు
- ఎవరైనా చనిపోతే ఆరు గంటల లోపు కళ్లు సేకరించాలి
- నేటి నుంచి జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మానవ శరీరంలో కంటికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. మరణానంతరం చేసే నేత్రదానంతో చూపులేని వారికి చూపునివ్వొచ్చు. నేత్రదానం చేసే వారిని ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా కేంద్ర ప్రభుత్వం జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు నిర్వహిస్తుంది. ఉమ్మడి జిల్లాలో 2015 నుంచి నేత్రదానం ప్రారంభమైంది. అంధత్వ నివారణ సంస్థ గణాంకాల ప్రకారం ఏటా 400మందికి పైగా కళ్లను దానం చేయడానికి ముందుకొస్తున్నారు. కరోనా సమయంలో కార్నియా సేకరణ కొంత కుంటుబడిన ఆ తర్వాత మళ్లీ పుంజుకుంది. కర్నూలు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి జిల్లా అంధత్వ నివారణ సంస్థ లెక్కల ప్రకారం 2022-2023లో 412, 2023-24లో 488, 2024-2025లో ఇప్పటి వరకు 352 నేత్రాలను కౌన్సిలర్ ద్వారా సేకరించారు.

నాలుగు హాస్పిటల్‌కు అనుమతి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రాంతీయ కంటి ఆసుపత్రి కర్నూలు, శాంతిరాం నంద్యాల, కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీలకు కార్నియాను సేకరించే అనుమతులు ప్రభుత్వం ఇచ్చింది. ఇటీవల కర్నూలు సుశీల నేత్రాలయానికి కార్నియా ఐ డొనేషన్‌కు అనుమతి లభించింది. కర్నూలు ఆర్‌ఈహెచ్, నంద్యాల శాంతిరాం హాస్పిటల్, కర్నూలు రెడ్‌క్రాస్ ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకు(హైదరాబాదు) సహకారంతో కార్నియాను సేకరిస్తుంది. సుశీల నేత్రాలయ సికింద్రాబాద్ వాసన్ ఐ బ్యాంకుకు పంపిస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు మోటీవేటర్స్‌గా పని చేస్తూ అవగాహన కల్పిస్తూ నేత్రదానం చేసే వారి సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నారు.

కార్నియా మార్పిడిలో సక్సెస్ రేట్ ఎక్కువ



శరీరంలోని అవయవాల మార్పిడి అన్నింటిలో కంటే కార్నియా మార్పిడిలో 90 శాతం సక్సెస్ రేట్ ఉంటుంది. ఒక వ్యక్తి కళ్లను దానం చేస్తే నలుగురికి చూపు ప్రసాదించొచ్చు. ఈ నెల 16న సుశీల నేత్రాలయంకు కార్నియా సేకరణ సెంటర్‌కు కలెక్టర్ నుంచి అనుమతి లభించింది. ఇప్పటి వరకు కర్నూలు, బేతంచెర్లలో ఇద్దరి నుంచి నేత్రాలను సేకరించాం.

● డాక్టర్ పి.రాఘవ్ ప్రీతమ్,
కార్నియా స్పెషలిస్టు, సుశీల నేత్రాలయ, కర్నూలు



ప్రభుత్వ ప్రాంతీయ కంటి వైద్యశాల

అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం



నేత్రదానంపై ప్రజల్లో, విద్యాసంస్థలు, విద్యార్థుల్లో ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తున్నాం. నేత్రదానం ద్వారా కార్నియా పొందిన వ్యక్తి పేరు ఎల్లప్పుడు రహస్యంగా ఉంచుతాం. నేత్రదానంపై ప్రజల్లో అపోహలున్నాయి. ప్రజల్లో కూడా చైతన్యం కలిగించి వారిలో అవగాహనను కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నేత్రదానానికి ముందుకు వస్తే 9849903116 నంబరును సంప్రదించాలి.

● డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు,
సూపరింటెండెంట్, ప్రాంతీయ కంటి ఆసుపత్రి, కర్నూలు

అందరూ ముందుకు రావాలి



నేత్రదానానికి అందరూ ముందుకు రావాలి. మరణించిన వ్యక్తి 4-6 గంటలలోపు నేత్రాదానం చేయాలి. గతంలో నల్లగుడ్డు పూర్తి భాగం అందుబాటులోనికి రావడంతో కార్నియాలో కొంత భాగం మాత్రమే మార్పిడి చేసేవారు. దీని లామెల్లార్ కరటోప్లాస్టి అంటారు. నల్లగుడ్డు మొత్తం దెబ్బతింటే దాత ఇచ్చిన కార్నియా ద్వారా కంటి చూపును ప్రసాదించొచ్చు.

- డాక్టర్ ఎస్.మున్నీర్ బేగం,
కార్నియా స్పెషలిస్టు, అమీలియో హాస్పిటల్, కర్నూలు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు
- విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం



ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు పిలుపునిచ్చారు. నగరంలోని రాజ్‌విహార్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం రజక విద్యాసమితి ఆధ్వర్యంలో 7వ రజక విద్యార్థుల ప్రతిభా పురస్కారాల ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీతో పాటు మాజీ ఎమ్మెల్సీ మాజీ ఎమ్మెల్యే దుమ్వారు రామారావు, రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి హాజరయ్యారు. పది, ఇంటర్, డిగ్రీల్లో ఉత్తమ మార్కులు సాధించిన 92 మంది విద్యార్థులకు మెడల్స్‌తో పాటు రూ.2వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ చదువు ద్వారానే సంఘంలో మర్యాద, హోదా దక్కుతుందని, ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, రజక విద్యాసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వెంకటేశ్, జిల్లా రజక సంక్షేమ సంఘం నాయకుడు బస్తిపాటి మౌలాలి, జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు పరమేష్, మధుసూదన్‌రావు, దోబి మహాసంఘ్ జిల్లా అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు జిల్లెల, శ్రీరాములు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నల్లమలలో గిరిజనుడిపై ఎలుగుబంటి దాడి

మహానంది, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వంట చెరుకు సేకరణ కోసం వెళ్లిన గిరిజనుడు నరసింహులుపై ఆదివారం ఎలుగుబంటి దాడి చేసింది. ఈ ఘటనలో గిరిజనుడు తీవ్రంగా గాయపడ్డాడు. గాజులపల్లి ఆర్ఎస్ చెంచుగూడేనికి చెందిన నరసింహులు నల్లమల అటవీ ప్రాంతంలోని చలమరేంజ్ పరిధిలోని సున్నంబట్టి ప్రాంతంలో వంట చెరుకు సేకరణ చేస్తుండగా ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కోడుమూరు రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గురువులు చెన్నయ్య, నాగేష్, స్వర్ణలత, తులసివేణి, ప్రభావతి, షాలుబాషాను ఆహ్వానించి దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతికి కృషి చేసిన గురువుల పాదాలకు నమస్కరించారు. అనంతరం పూర్వవిద్యార్థులు ఒకరినొకరి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాత శాల అభివృద్ధికి చేయూతనందిస్తామని కొందరు పూర్వవిద్యార్థులు ముందుకువచ్చారు. వారు మాట్లాడుతూ చాలా ఏళ్ల తర్వాత అందరూ కలుసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కుంపటి కృష్ణయ్య, హుస్సేన్, మాబు బాషా, చైతన్యకుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

- ప్రయాణికులకు స్వల్ప గాయాలు

ఓర్వకల్లు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈఘటనలో నన్నూరు గ్రామ సమీపాన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై నన్నూరు గ్రామ సమీపాన ఆదివారం తెల్లవారుజామున ముందు వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను హైదరాబాదు నుంచి తిరుపతి వెళ్తున్న మోక్ష ట్రావెల్స్ బస్సు ముందు వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు, ట్రాక్టర్ ముందు భాగాన నుజ్జునుజ్జయ్యాయి. స్వల్ప గాయాలైన ప్రయాణికులకు ప్రథమ చికిత్స చేయించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు, టోల్‌గేటు సిబ్బంది చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్వాంటమ్ సాంకేతికతతోనే అభివృద్ధి

- ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు



క్వాంటమ్ ఒప్పంద సంతకాలతో ఆర్‌యూ వీసీ, రిజిస్ట్రార్

కర్నూలు అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ సాంకేతికతతోనే అభివృద్ధి సాధ్యమని ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు అన్నారు. ఆదివారం రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)లో తన చాంబర్లో క్విన్ఫోసిస్ ప్రైవేట్ లిమిటెడ్ స్థాపకులు సీవో చీఫ్ సైంటిస్టు డాక్టర్ వల్లూరు మహేశ్వరరావు రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడుతో కలిసి ఎంవోయూలో సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఇకపై క్వాంటమ్ భాగస్వామ్యంతో పరిశోధనలు, ఆవిష్కరణలతో వర్సిటీ అవగాహన ఒప్పదం కుదుర్చుకుందని తెలిపారు. పరిశోధన, అభివృద్ధి, ఇంటర్న్‌షిప్‌లు, ఆవిష్కరణ సహకారం, సంయుక్త కార్యక్రమాలు వంటి విభాగాల్లో కలిసి పనిచేయడంపై దృష్టి సారిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌డబ్ల్యు వెంకట సుందరానంద పుచ్చా, సి.విశ్వనాథరెడ్డి, ప్రొఫెసర్లు, విదార్థులు పాల్గొన్నారు.

నేరాలను అరికడతాం

- ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ● 70 బైకులు స్వాధీనం

నంద్యాల టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కార్డన్ సెర్చ్‌తో నేరాలను అరికడతామని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. ఆదివారం ఉదయం పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా ప్రజలకు భరోసా కల్పించాలని కార్డెన్ సర్చ్ నిర్వహించామన్నారు. కార్డన్ సర్చ్‌లో సరియైన పత్రాలు లేని 70 బైకులు, 50 మద్యం బాటిళ్లు, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా పోలీసులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

చట్ట వ్యతిరేక కార్యకల పాలకు దూరంగా ఉండి సమాజంలో మంచి పౌరులుగా మెలిగి నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు, వారి ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచా మన్నారు. ఎవరైనా ఎక్కువ సార్లు నేరాలకు పాల్పడితే వారిపై కూడా రౌడీ షీట్ ఓపెన్ చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

బార్లకు బోణీ

- ఆదోనిలో ఐదు దరఖాస్తులు
- ఊపిరి పీల్చుకున్న ఎక్సైజ్ శాఖ
- మిగిలింది రెండు రోజులే

కర్నూలు అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బార్లకు సంబంధించి ఎట్టకేటలకు బోణీ అయ్యింది. ఆదోని పట్టణంలోని రెండు బార్లకు ఐదు దరఖాస్తులు వేశారు. ఈనెల 18వ తేదీన 26 బార్లకు నోటిఫికేషన్ జారీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దరఖాస్తులు వేసేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ సతమతమైంది. ఆదివారం ఒక్కసారిగా 32 మంది దరఖాస్తులు వేసేందుకు ఆన్‌లైన్ ద్వారా ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. ఈనెల 26వ తేదీ చివరి రోజు కావడంతో చివరి రెండు రోజులు కీలకంగా మారాయి. మొదట ఎవరూ దరఖాస్తులు చేయకూడదనే నిర్ణయానికి వచ్చిన బార్ల యాజమాన్యాలు ఒక్కొక్కరుగా దరఖాస్తులు వేసేందుకు సిద్ధమతున్నారు. ఆదోని-11, ఎమ్మిగనూరు-1, కర్నూలు-22 మంది ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునేందుకు ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. గడువులోపు దరఖాస్తు రుసుం చెల్లించి ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను పూర్తిచేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులు రావడంతో ఎక్సైజ్ శాఖ ఊపిరి పీల్చుకుంది. రెండు రోజుల్లో బార్లకు పూర్తి స్థాయిలో దరఖాస్తులు ప్రక్రియకు స్పందన ఉండే అవకాశం ఉందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం. సుధీర్ బాబు తెలిపారు. ఇప్పటికే ప్రక్రియకు సంబంధించిన పలు రకాల సందేహాలను కార్యాలయానికి వచ్చి సంప్రదించే తీరును బట్టి భారీ ఎత్తున స్పందన ఉండే పరిస్థితి ఉందని తెలిపారు.

గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి సీఎం కృషి

కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



గిరిజన సలహామండలి సభ్యులు వెంకటపతితో పాటు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, దస్తగిరిని సన్మానిస్తున్న గిరిజన సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎనలేని కృషి చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. ఆదివారం ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప అధ్యక్షతన గిరిజన సలహా మండలి సభ్యుడు వెంకటపతిని సన్మానించారు. ఈ కార్యక్రమానికి పత్తికొండ ఎమ్మెల్యే కేఈ కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం దళితుల, గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి మాట్లాడుతూ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆశీస్సులతో సీఎం చంద్రబాబు నాయుడు తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్, మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, టీడీపీ సీనియర్ నాయకులు సాంబశివరారెడ్డి, రామనాయుడు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర నాయకులు బత్తిన లోకనాథ్, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామ్‌రాజ్, జిల్లా కార్యదర్శి వెంకటేశ్‌తోపాటు గిరిజన ఉద్యోగ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు దొరికారు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీని వాడుకోవడంలో వారు ముందున్నారు. గూగుల్ మ్యాప్‌ను ఆధారంగా చేసుకొని చోరీలకు పాల్పడ్డారు. ఎత్తిపోతల పథకాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుకెళ్లడమే లక్ష్యంగా సాగారు. వీటిని మహారాష్ట్రకు తీసుకెళ్లి అక్కడ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న దొంగల ముఠా ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. ఆదివారం పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఎస్ఐలు చంద్రశేఖర్, సురేష్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ఓ కుగ్రామానికి చెందిన ముగ్గురు దొంగలు ఎత్తిపోతల పథకాలు ఎక్కడెక్కడ ఉన్నాయి? వాటివద్ద ఎన్ని మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి? వాటి వద్దకు ఎలా వెళ్లాలి? అనే వివరాలను గూగుల్ మ్యాప్‌లో సేకరిస్తారు. ముందుగా టార్గెట్ చేసిన ప్రాజెక్టు సమీప పట్టణానికి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వస్తారు. ప్రాజెక్టు వద్ద 10రోజుల పాటు రెక్కీ నిర్వహిస్తారు. ఆతర్వాత ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులోని కాపర్‌ను దొంగలిస్తారు. వాటిని తరలించేందుకు మహారాష్ట్ర నుంచే వాహనాన్ని తెప్పించుకుంటారు. ఈ ముఠా అక్కడికి తీసుకెళ్లి అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. ఈఏడాది మార్చి 10వ తేదీన నాగటూరు సమీపంలోని మల్యాల ఎత్తిపోతల పథకం వద్ద ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ దొంగతనానికి గురైంది. ఈఅంశంపై ఎత్తిపోతల పథకం కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు ఫిర్యాదు చేసుకున్న పోలీసులు విచారణకు దిగారు. సంఘటన స్థలం వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పట్టణంలో ఆయా తేదీల్లో లాడ్జీల్లో ఎవరెవరు ఉన్నారన్న వివరాలను తెలుసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన రాజేంద్ర బబస్ బోలే పేరు మీద రూం బుక్కు అయ్యింది. అక్కడ ఉన్న ఫోన్‌నెంబర్ ఆధారంగా నిందితులు ఉన్న గ్రామాన్ని పోలీసులు గుర్తించారు. నిందితుల కోసం అక్కడికి వెళ్లి గాలింపు చేపట్టారు. ప్రధాన నిందుతుడు రాజేంద్ర బబస్ బోలేతో పాటు మరో ఇద్దరు నాందేవ్ భిలాస్ సటపుటే, సంజయ్ లక్ష్మణ్ హర్ గావోకర్‌ను కూడా ఈకేసులో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ. లక్ష నగదు, ఒక బైక్, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఆదివారం నందికొట్కూరు కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాపర్‌ను అమ్మిన నగదును పూర్తిస్థాయిలో రికవరీ చేసేందుకు ఏ1 నిందితుడైన రాజేంద్ర బబస్ బోలెను పోలీసు కస్టడీకి అప్పగించాలని కోర్టును కోరినట్లు ఆయన తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంతో సహకరించిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందిస్తూ.. నగదు బహుమతిని అందజేశారు.

బాధితులకు టీడీఆర్ బాండ్ల పంపిణీ


టీడీఆర్ బాండ్లను అందజేస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ఎన్‌హెచ్-340సి జాతీయ రహదారి విస్తరణలో స్థలం కోల్పోయే బాధితు లకు ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల జారీ ప్రక్రియ ప్రారంభించినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం తెలిపారు. స్థలం కోల్పోతున్న ముగ్గురు బాధితులకు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో టీడీఆర్ బాండ్లను అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య సర్కిల్ నుంచి ఎస్ఎస్ గార్డెన్స్ వరకు ఎన్‌హెచ్ 340 సీ జాతీయ రహదారిని 100 అడుగులుగా వెడల్పు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మొత్తం 2.34 కి.మీ పొడవున ఈ విస్తరణలో 201 ఆస్తులు ప్రభావితం కాగా, 178 ఆస్తులు పూర్తి ప్రభావితం అవుతున్నాయన్నారు. ఈ క్రమంలో తొలుత భూములు కోల్పోయిన ముగ్గురు బాధితులకు టీడీఆర్ బాండ్లు అందజేశామన్నారు. త్వరలో మరో 40 మందికి బాండ్లు అందిస్తామన్నారు. ప్రభావిత ఆస్తిదారులకు ఇప్పటికే 159 నోటీసులు జారీ చేయగా.. 110 మంది సమ్మతి పత్రాలు ఇచ్చారని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్‌బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

● మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్

కర్నూలు అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆర్థిక వ్యవస్థ దిగజార్చిన జగన్మోహన్ రెడ్డికి కూటమి ప్రభుత్వంలోని ఆర్థిక వ్యవస్థపై మాట్లాడే అర్హత లేదని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్ అన్నారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజనతో రూ. 90వేల కోట్ల అప్పుతో రూ. 16,500 కోట్ల లోటు బడ్జెట్‌తో ఆవిర్భవించిన నవ్యాంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు బస్సులో బస చేసి రాష్ట్రా ఆర్థిక స్థితిని శ్రామికుడిగా పని చేసి కాపాడితే ..సీఎంగా బాధ్యతలు చేపట్టిన జగన్ చేసిన విధ్వంసక పాలనను ప్రజలు ఎన్నటికి మరచిపోరని అన్నారు. ఆదానీ డేటా సెంటర్, లూలూ కంపెనీ, 19 కియా అను బంధ పరిశ్రమలు, అమర్ రాజా, లాంటి అనేక కంపెనీలతో పాటు రాష్ట్రం నుంచి లక్షల కోట్ల పెట్టుబడులను తెచ్చారని, కానీ జగన్‌రెడ్డి వాటిని ఆహంకార పూరిత దోరణితో తరిమేసి రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని మండిపడ్డారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరవుతారని, ప్రజలు లిఖితపూర్వకంగా సమర్పించే ఫిర్యాదులను స్వీకరిస్తామని పేర్కొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఓర్వకల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులోని తోటగేరిలో వెలసిన ఆంజనేయ స్వామికి ఆదివారం పూజలు నిర్వహించారు. భక్తులు మహిళలు స్వామివారికి కాయకర్పూరాలు సమర్పించారు. గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాల శాఖ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఏపీ ఎన్జీవోస్ ఎన్నికల జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ఎన్నికల అధికారిగా, సహాయ ఎన్నికల అధికారిగా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ కోడుమూరు తాలుకా అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, అబ్జర్వర్‌గా జిల్లా సంయుక్త కార్యదర్శిగా కేసీహెచ్ కృష్ణుడు వ్యవహరించారు. 9 మంది పోస్టులకు 9 మంది నామినేషన్లు వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నగర అధ్యక్షు డు ఎంసీ కాశన్న, పాములపాడు జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ఎన్జీవోస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సేవ చేసే భాగ్యం దక్కడం అదృష్టం

● మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి


శేషగిరిశెట్టిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రైతులకు సేవ చేసే భాగ్యం దక్కడం తన అదృష్టం కర్నూలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని వాసవీ కన్యకాపర మేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు వాసుదేవశర్మ, కాశీ ఫణిశర్మలు వైస్ చైర్మన్ శేషగిరిశెట్టిని సన్మానించారు. శేషగిరి శెట్టి మాట్లాడుతూ మంత్రి టీజీ భరత్ నాపై ఎంతో నమ్మకంతో కర్నూలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవి అప్పగించారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందించేందుకు చర్య లు తీసుకుంటానని అన్నారు. మార్కెట్ యార్డులో రైతులకు అవసరమైన వసతులు కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామ న్నారు.

నన్నూరులో రక్తదాన శిబిరం

ఓర్వకల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు గ్రామంలో ఆదివారం నందమూరి అభిమానుల ఆధ్వర్యంలో తలసేమియా, క్యాన్సర్ చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని టీడీపీ మండల నాయకుడు విశ్వేశ్వరరెడ్డి ప్రారంభించారు. 25 మంది రక్తదానం చేశారు. విశ్వేశ్వరెడ్డి మాట్లాడుతూ యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బుజ్జప్ప, ఖాజామియా, హుశేన్ సర్కార్, జాకీర్ హుశేన్, కర్నూలు ఎన్‌టీకే ఫ్యాన్స్ సేవా సమితి ఉపాధ్యక్షులు షేక్ మోతీలాల్, మొల్ల మహ్మద్ రఫీ, సురేష్, అయ్యన్న, షంషుద్దీన్ పాల్గొన్నారు.

తెగుళ్లు.. రైతన్న గగ్గోళ్లు

● రాలిపోతున్న కాయ, పూత
● అప్రమత్తంగా లేకపోతే భారీ నష్టం

ఓర్వకల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఇప్పటికే పత్తి, కంది, మొక్కజొన్న పంటలు తెగుళ్లతో పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. రైతులు జాగ్రత్తలు తీసుకో కుంటే పంటలు పూర్తిగా నాశనమయ్యే అవకాశముంది. మండలంలోని హుశేనాపురం, ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, మీదివేముల, ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, సోమయాజులపల్లె గ్రామాల్లో పదివేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఈ ఏడాది వర్షాభావంతో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో పంట ఏపుగా పెరిగింది. పూత, మొగ్గలు, కాయలు రాలిపోతున్నాయి. కాయలు నల్లబడి నేలపాలవుతున్నాయి. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఎకరాకు రూ.30వేలు పెట్టుబడి పెట్టారు. పంట సాగు చేసి 90 రోజులు కావస్తుంది. ఆరు దఫాలుగా క్రిమిసంహారక మందులు పిచికారి చేశారు. అయినా తెగుళ్ల ఉధృతి తగ్గడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, అయితే ఈ ఏడాది 5 నుంచి 10 క్వింటాళ్లకు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు గగ్గోలు చెందుత న్నారు. ఈ తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


వాడిపోతున్న పత్తి పంట

రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని..

రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఫర్టిలైజర్స్ యజమానులు దగా చేస్తూ జేబులు నింపుకుంటున్నారనే విమర్శలున్నాయి. నాసిరకం మందులను బ్రాండెడ్ కంపెనీ పేరుతో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఫర్టిలైజర్స్ యజమానులకు అవగాహన లేకపోయినా అమాయక రైతులకు మాటలు చెప్పి తొలచిన మందులను రైతులకు కట్టబెడుతున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి..

తీవ్రంగా నష్టపోతున్నాం



పత్తికి గత ఏడాది అధిక ధర ఉండటంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. పెట్టుబడి రూ.2లక్షలు పెట్టారు. చెట్టు ఏపుగా పెరిగినా.. చెట్టుకున్న కాయలు పూత, మొగ్గ వర్షాలు అధికం కావడంతో రాలిపోతున్నాయి. పంటలపై పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

● హసన్, రైతు

రైతులకు అవగాహన కల్పించండి



ఈ ఏడాది వర్షాలు బాగా పడటంతో పొలాల్లో నీళ్లు నిలిచాయి. దీంతో పత్తి, కంది పంటలు రైతులను తీవ్రంగా నష్టపరుస్తుంది. చేతికొచ్చిన పంట దిగజారిపోవడంతో రైతులు గుండెలు బాదుకుంటు న్నారు. తెగుళ్లపై రైతులు, అధికారులు అవగాహన కల్పించాలి.

● గోపా కృష్ణారెడ్డి, రైతు

తగ్గిన ఉల్లి ధర

అన్నదాత దిగాలు

కోడుమూరు రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో ఉల్లి ధర తగ్గింది. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వేలకు వేలకు పెట్టుబడి పెట్టి ఉల్లి పంటలు సాగు చేస్తే గిట్టుబాటు ధర లేక నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కోడుమూరు తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని ఖాళీ స్థలంలో రైతులు ఉల్లి దిగుబడులను ఆరబోశారు. ఈ ఖరీఫ్ ఉల్లి దిగుబడులు ప్రారంభం నుంచే కర్నూలు మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేవు. క్వింటా రూ.1200 మించడం లేదు. మోడల్ ధర రూ. వెయ్యిలోపే ఉంది. ఉల్లి కోత, కల్లం తరలింపు, గ్రేడింగ్, ప్యాకింగ్, రవాణా తదితర ఖర్చును లెక్కకడితే రైతుకు క్వింటా రూ. 200 వరకు ఖర్చు అవుతోంది. ఇక నారు పెంపకం, నాటు, కలుపులు, ఎరువులు, పిచికారీ ఖర్చులు ఎకరాకు రూ. 70 వేలు మించుతోంది. ఈ లెక్కన ఇపుడున్న ధరలకు విక్రయిస్తే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని అంటున్నారు. దీంతో కర్నూలు మార్కెట్‌కు ఉల్లి తరలించడానికి రైతులు జంకుతున్నారు. దీన్ని ఆసరా చేసుకుని వ్యాపారులు తమ దళారుల ద్వారా రైతుల వద్దకు వాలిపోతున్నారు. ఉల్లికి గిట్టుబాటు ధరలు లేవంటూ రైతులను భయపెడుతూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తు న్నారు. ఉల్లిని రోజూ గ్రేడింగ్ చేయలేక కొందరు రైతులు తక్కువ ధరకే విక్రయించుకుంటున్నారు. మరికొందరు గ్రేడింగ్ చేసుకుంటూ గిట్టుబాటు ధర కోసం ఎదురు చూస్తున్నారు.


ఉల్లిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

మట్టి వినాయకుడిని పూజిద్దాం

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్


మట్టి వినాయకుడి విగ్రహాన్ని అందజేస్తున్న మంత్రి

కర్నూలు కల్చరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ నగర ప్రజలను కోరారు. ఆదివారం నగరంలోని వెంకటేశ్ థియేటర్ పక్కనగల ప్రభుత్వ గో సంరక్షణశాలలో, గాయత్రి గోసేవ సమితి ఆధ్వర్యంలో, వేముల రమేష్ ఏర్పాటు చేసిన ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్ర మాన్ని మంత్రి టీజీ భరత్ ప్రారంభించి ప్రజలకు అందజేశారు. అలాగే నగరంలో పాతబస్టాండు సమీపంలోని వాసవీ ఏజెన్సీస్ అధినేత శేషఫణి ఏటా అందజేస్తున్న మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని కూడా మంత్రి ప్రాంభించి, విగ్రహాలను ఉచితంగా ప్రజలకు అందించారు. టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కర్నూలులో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని అన్నారు. టీజీవీ సంస్థల తరఫున కర్నూలు నగరంలో మట్టి వినాయకుని విగ్రహాలే పూజించేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

బుధవారపేటలో కార్డన్ సెర్చ్


ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ బాబు ప్రసాద్

కర్నూలు క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుధవారపేటలో ఆదివారం డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వ ర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. బుధవారపేటలోని రౌడీషీటర్ల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. నెంబర్ ప్లేట్లు లేని 10 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. డీఎస్పీ బాబు ప్రసాద్ మాట్లాడుతూ కాలనీలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించాలి: డీవైఎఫ్ఐ



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు రైల్వే వ్యాగన్ పనులు పూర్తి చేసి యువతకు ఉపాధి కల్పించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తబస్టాండు సమీపంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు శిరీష, షైన, హుస్సేన్ బాషా, సహాయ కార్యదర్శులు వీరేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: సీఐటీయూ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్. రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీ స్టేట్ వేర్ హౌస్, ఎఫ్‌సీఐ అండ్ ప్రైవేట్ గోడౌన్స్ హమాలీ యూనియన్ మహాసభ కేకే భవన్‌లో విష్ణుమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ కార్మికులు పనికి తగిన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు ఓబులేసు, రాజు, ఆర్.మహేష్ పాల్గొన్నారు.

● నగరంలోని బుధవారపేట శ్మశానవాటికను అభివృద్ధి చేయడంలో అధికారులు విఫలమయ్యారని సీపీఎం నగర కార్యదర్శివర్గసభ్యుడు కె.రామకృష్ణ విమర్శించారు. ఆదివారం సీపీఎం సభ్యులు శ్మశానవాటికను పరిశీలించారు. రామకృష్ణ మాట్లాడుతూ శ్మశానవాటికలో కంపచెట్లు పెరిగి పోయాయని, శవాన్ని పూడ్చడానికి స్థలం కూడా లేదని అన్నారు. నాయకులు బంగి పద్మ, చంద్ర, ఆర్ కృష్ణ పాల్గొన్నారు.

● క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు అన్నారు. జొహరాపురం భవిత ఇంగ్లీషు పాఠశాలలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రంలో ఆధ్వర్యంలో యూనివర్సల్ కరాటే స్కూలు బెల్ట్ గ్రేడింగ్ టెస్టును మాస్టర్ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమంలో యూనివర్సల్ కరాటే గ్రాండ్ మాస్టర్ శ్రీనివాసులు, మాస్టర్లు, అమితేష్, నాగన్న, బాలక్రిష్ణ, తిప్పన్నలు పాల్గొని క్రీడాకారులకు బెల్టులను ప్రదానం చేశారు.

ఒకే ఇంట్లో ముగ్గురికి ఉద్యోగాలు

డీఎస్సీ ఫలితాల్లో ఉలిందకొండ వాసుల ప్రతిభ

కల్లూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములు డీఎస్సీలో ప్రతిభ చాటారు. ఉలిందకొండ గ్రామం ఎస్.మన్సూర్‌బాషా, ఎస్.జిలానీ బేగం దంపతులకు ముగ్గురు మహమ్మద్ హనీఫ్ం బాషా, ఎస్.హసీనా భాను, హరూన్‌రషీద్ సంతానం. శుభకార్యాలకు వంటలు చేస్తూ వచ్చే సంపాదనలతో ఒకపక్క కుటుంబాన్ని పోషిస్తూ కష్టపడి ముగ్గురు పిల్లలను చదివించారు. అమ్మా, నాన్నల కష్టాన్ని చూసి పిల్లలు పట్టుదలతో చదివి డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో జిల్లా ర్యాంకులు కైవసం చేసుకున్నారు. మహమ్మద్ హనీఫ్ బాషా ఎస్‌జీటీ తెలుగులో 79.67 మార్కులతో జిల్లాలో 921 ర్యాంకు, ఎస్.హసీనా బేగం ఎస్‌జీటీ తెలు గులో 81.62 మార్కులతో జిల్లాలో 634 ర్యాంకు, హరూన్‌రషీద్ ఎస్‌జీటీ తెలుగులో 84.11 మార్కుల తో జిల్లాలో 331 ర్యాంకులను సొంతం చేసుకున్నారు. అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే ఈవిజయం సాధ్యమైందని వారన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో జిల్లా 23వ ర్యాంక్: కల్లూరు మండలం బస్తిపాడుకు చెందిన కురువ రమేష్ డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసి స్టెంట్ (బయాలజీ) జిల్లా స్థాయిలో 23వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. తండ్రి కురువ గిడ్డయ్య తల్లి పద్మావతమ్మలకు ఇద్దరు సంతానం, పెద్దవాడైన రమేష్ పట్టుదలతో చదివి డీఎస్సీ ఫలితాల్లో రెండు పోస్టులకు ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. స్కూల్ అసి స్టెంట్ (బయాలజీ)80.05 మార్కులతో జిల్లాలో 23వ ర్యాంకు. ఎస్‌జీటీలో 83.23 మార్కులతో జిల్లాలో 421 ర్యాంకు సొంతం చేసుకున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ విజయం సాధించానని రమేష్ తెలిపారు.


23వ ర్యాంకు సాధించిన రమేష్

చిన్నారుల్లో సంస్కృతి, సంప్రదాయ భావాలు పెంచాలి

ఆర్ఎస్ఎస్ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ లలిత

కర్నూలు కల్చరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో సంస్కృతి, సంప్రదాయ భావాలు పెంచాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ లలిత అన్నారు. ఆదివారం గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి, సంస్కార భారతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో, రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పాఠశాల స్థాయి విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. నగర శివారు బి.తాండ్రపాడులోని క్రైడో స్కూలులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 650 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన లలిత మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మక భావాలు పెంపొందించేలా ఏటా గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ఏటా పోటీలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. సమితి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు నిమజ్జనం రోజున బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సమితి జిల్లా కార్యదర్శి గోరంట్ల రమణ, నగర అధ్యక్షుడు రంగస్వామి, నాయకులు చింతలపల్లి రామకృష్ణ, క్రైడో పాఠశాల అధినేతలు శ్రావ్య, కార్తీక్, సంస్కార భారతి నగర ప్రముఖ్ మాకం నాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లలిత

జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలి

కర్నూలు కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు తొలి దళిత ముఖ్యమంత్రి, దివంగత దామోదరం సంజీ వయ్య పేరు పెట్టాలని దామో దరం సంజీవయ్య జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షుడు నక్కల మిట్ట శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం నగర శివారు పెద్దపాడులోని సంజీవయ్య నివాస స్థలమైన 'సీతి గృహ'లో నిరాహార దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోనె నాగరాజు హాజరై మాట్లాడారు. దేశానికి నిస్వార్థంగా సేవలు అందించిన సంజీవయ్య పేరును ఈ జిల్లాకు పెట్టాల్సిందేనని కోరారు. మాల గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.ఓబులేసు మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామన్నారు. సమితి కన్వీనర్ జేవీ కృష్ణయ్య మాట్లాడుతూ సంజీవయ్య పేరు ఈ జిల్లాకు పెట్టడమే ఆయనకు జిల్లా వాసులు అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకుడు అయ్యన్న, దామోదరం సంజీవయ్య ట్రస్టు సభ్యుడు రంగస్వామి, సమితి జిల్లా అధ్యక్షుడు త్యాగరాజ్, దాసరి రామశేషయ్య, నాగభూషణం, కాంగ్రెస్ నాయకుడు పోతుల శేఖర్, పెద్దపాడు గ్రామస్థులు అయ్యస్వామి, పాండురంగయ్య, సురేష్, తులసీదాస్, రామమూర్తి, ప్రేమ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.


నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

సైక్లింగ్‌తో ఆరోగ్యం: ఎస్ఐ



సైకిల్ ర్యాలీ చేస్తున్న ఎస్ఐ, పోలీసులు

సి.బెళగల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్ కార్యక్రమంలో పాల్గొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్ఐ పరమేష్ నాయక్ అన్నారు. సి.బెళగల్‌లో సన్ డేస్ ఆన్ సైకిల్ ర్యాలీని ఎస్ఐ ప్రారంభించారు. పోలీసు స్టేషన్ నుంచి పాత బస్టాండు వరకు సైకిల్ ర్యాలీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ వినాయక చవితిని ప్రజలంతా కలిసి మెలసి జరుపుకోవాలన్నారు. సమావేశంలో రాముడు, మారెప్ప, హరోన్, ఉస్మాన్‌బాషా, రసూల్ పాల్గొన్నారు.

జిల్లా రథసారథి ఎవరు?

5వ పేజీ తరువాయి

త్రిసభ్య కమిటీ సభ్యులు వీరే :

కర్నూలు పార్లమెంట్ పార్టీ కమిటీ ఎంపిక కోసం రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, హిందూపురం ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబును త్రీమెన్ కమిటీ సభ్యులుగా నియమించారు. వీరు మంగళవారం జిల్లాకు రానున్నారు. ముఖ్య నాయకుల సమావేశంలో అధ్యక్ష, జిల్లా కార్యవర్గం ఎంపికపై ముఖ్య నాయకుల అభిప్రాయాలు తీసుకుంటారు. ముందుగా అధినేత చంద్రబాబు సందేశాన్ని వినిపిస్తారు.

దిశా నిర్దేశం: పార్లమెంట్ పార్టీ (జిల్లా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కార్యనిర్వహణ కార్యదర్శులు, సహా పార్టీ అనుబంధ సంఘాల కార్యవర్గం ఎంపిక కోసం అధిష్ఠానం త్రిసభ్య కమిటీ సభ్యులను నియమించింది. ఆ కమిటీ సభ్యులు మంగళవారం ఎంపీ, ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో భేటీ అవుతారు. అయితే.. పార్లమెంట్ కమిటీ ఎంపికపై త్రిసభ్య కమిటీ సభ్యులకు అధినేత, సీఎం చంద్రబాబు ఇప్పటికే సూచనలు చేశారు. మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు ఎంపికైన కమిటీలు సహా సమగ్ర వివరాలతో అధిష్ఠానానికి పంపుతారు. త్రీమెన్ కమిటీ ప్రతిపాదించిన పార్లమెంట్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కమిటీ, అనుబంధ కమిటీలను అధినేత, యువనేతలు పరిశీలన తరువాత వచ్చే నెల 3న జిల్లా అధ్యక్ష, కార్యవర్గం సహా అనుబంధ సంఘాల కార్యవర్గాన అధిష్ఠానం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

ఆశావహుల్లో ఉత్కంఠ : కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా పి.తిక్కారెడ్డి ప్రస్తుతం కొనసాగుతున్నారు. గత ఎన్నికల ముందు మంత్రాలయం టీడీపీ టికెట్ ఆశించారు. అయితే.. సామాజిక, రాజకీయ సమీకరణాలు దృష్ట్యా వాల్మీకి సామాజికవర్గానికి చెందిన మాధవరం ఎన్.రాఘవేంద్ర రెడ్డికి ఇచ్చారు. తిక్కారెడ్డిని బుజ్జగించేందుకు టీడీపీ జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చారు. ఆయన సారథ్యంలోనే ఎన్నికలు నిర్వహించారు. తాజాగా టీడీపీ అధ్యక్షుడిగా తిక్కారెడ్డినే కొనసాగిస్తారా..? కొత్తవారికి చాన్స్ ఇస్తారా..? ఆ పార్టీలో ప్రధానంగా చర్చ జరుగుతోంది. టీడీపీ అధ్యక్ష పీఠం కోసం ఆశావహుల్లో 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆదోని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, టీడీపీ కర్నూలు సిటీ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఆకెపోగు ప్రభాకర్, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు, న్యాయవాది కేఈ జగదీష్‌గౌడ్, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ వాహిద్ హుస్సేన్ ఉన్నారు. ఇప్పటికే నామినేటెడ్ పదవులు ఇచ్చిన వారికి పార్టీ పదవులు ఇవ్వని పక్షంలో ఇతరులకు ఎవరికి అవకాశం వస్తుందోనని చర్చించుకుంటున్నారు.

34 మందితో జిల్లా కార్యవర్గం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి సహా ఉపాధ్యక్షులు-7, కార్యదర్శులు-7, ఆర్గనైజింగ్ కార్యదర్శులు-7, అధికార ప్రతినిధులు-7 మీడియా కో-ఆర్డినేటర్, సోషియల్ మీడియా కో-ఆర్డినేటర్.. ఇలా 34 మందితో టీడీపీ జిల్లా కమిటీ ఎంపిక చేస్తారు. అలాగే.. 17 అనుబంధ విభాగాలకు ఒక్కో విభాగంలో 28 మందితో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. వీరితో పాటు 54 సాధికార కమిటీలు ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీల్లో 14 మంది సభ్యులు చొప్పున ఉంటారు. అంటే.. టీడీపీ జెండా మోసే కీలకమైన కార్యకర్తలకు పార్టీ పదవులు దక్కే అవకాశం ఉంది. అలాగే.. పార్టీ పదవుల్లో క్లస్టర్ ఇన్‌చార్జిలకు ప్రాధాన్యత ఉంటుందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు.

బీసీ హాస్టల్‌లో షెడ్డు ఏర్పాటు



బీసీ హాస్టల్‌లో షెడ్డు వేసిన దృశ్యం

మద్దికెర ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో మధ్యాహ్న భోజనం చేసేందుకు నీడ లేక విద్యార్థులు ఇబ్బంది పడేవారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఎంపీ నిధులు రూ.మూడున్నర లక్షలతో షెడ్డును నిర్మించారు. దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సురవరం సుధాకర్ రెడ్డి మృతి బాధాకరం

మద్దికెర ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఐ అగ్ర నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి మృతి సీపీఐకి తీరని లోటు అని మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి మదనంతపురం హనుమన్న అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి పేద ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఆయన మృతి బాధాకరమని తెలిపారు.

పంట నష్టపరిహారం అందించాలి

మద్దికెర ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది రైతులు సాగు చేసిన పంటలు అధిక వర్షాల వల్ల దెబ్బతిన్నాయని, ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించాలని మండల వైసీపీ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్, మాజీ ఇరిగేషన్ డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, మండల వైసీపీ ఉపాధ్యక్షులు కృష్ణాయాదవ్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు వివిధ పంటలు సాగు చేశారని, అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయారన్నారు. ప్రభుత్వం నష్టం అంచనా వేసి రైతులను ఆదుకోవాలని అన్నారు.

రంగనాథ స్వామి ఆలయ చైర్మన్ పదవికి ఒక దరఖాస్తు

మద్దికెర ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి దేవాలయ చైర్మన పదవికి ఒకే ఒక దరఖాస్తు వచ్చింది. దేవాలయ చైర్మన్ పదవి కోసం దరఖాస్తు చేసుకోవాలని దేవాలయ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 27వ తేదీలోపు చైర్మన్ పదవికి దర్మకర్తల పదవికి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. అయితే ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు గ్రామానికి చెందిన పారా రవికుమార్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో తెలుగుదేశం పార్టీలో ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. దీంతో పారా రవికుమార్ చైర్మన్‌గా ఎన్నిక కానున్నారు.

బెంచీల ఏర్పాటు



బెంచీలు ఏర్పాటు చేసిన దృశ్యం

మద్దికెర ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆయా వీధుల్లో దేవాలయాలు, కళాశాలల ఆట స్థలాలు, ప్రధాన బస్టాండ్ల వద్ద రూ.2.50లక్షలతో 50 బెంచీలను ఏర్పాటు చేశారు. స్థానిక కళాకారుడు ఎస్వీ ప్రసాద్ యాదవ్, నారాయణమ్మ దంపతుల కుమారుడైన ఎల్ఐసీ ఏజెంట్ ఎస్.విజయప్రసాద్ యాదవ్ సొంతడబ్బులతో బెంచీలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర జన విజ్ఞాన వేదిక కార్యదరి హరిప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షులు శివప్రసాద్ యాదవ్ వీటిని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విజయప్రసాద్ యాదవ్ గ్రామంలో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు జయరామిరెడ్డి, హరీష్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం ఇస్తున్న మిత్రులు

తుగ్గలి , ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వరకు తనతో పాటు చదువుకున్న పక్కీరప్ప స్నేహితుడు అనారోగ్యంతో మృతి చెందడంతో తోటి స్నేహితులు మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం జొన్నగిరి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 2007 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థి ఫక్కీరప్ప అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు మిత్రులు సుధ, అంజిలతో పాటు మరికొందరు మిత్రులు రూ.36,500 నగదును అందించారు. కార్యక్రమంలో మిత్రులు సురేష్, లచ్చి, జయ, సుధ, చంద్ర, శ్రీను, అశోక్ ఉన్నారు.

ఆదర్శంగా నిలవాలి



లావణ్యను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు

తుగ్గలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నో కష్టాలు ఎదుర్కొని విద్యార్థిగా విద్యనభ్యసించి విజాయాన్ని సాధించి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టావు.. ఉపాధ్యాయురాలిగా కూడా అందరికీ ఆదర్శంగా నిలవాలని మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, జిట్టా నగేష్ అన్నారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయుల జాబితాలో 94.5 మార్కులు సాధించిన లావణ్యను ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు పులికొండ నాయక్, రామాంజనేయులు, వెంకట్, సురేష్, ఉపాధ్యాయ సంఘం నాయకులు రామానాయుడు పాల్గొన్నారు.





బ్రిడ్జిపై రంధ్రం ఏర్పడి కడ్డీలు తేలిన దృశ్యాలు

ప్రమాదకరంగా బ్రిడ్జి

- శిథిలావస్థలో అలారుదిన్నె బ్రిడ్జి
- కడ్డీలు తేలి ప్రమాదకరంగా మారిన వైనం
- ఆందోళనలో వాహనదారులు

ఆస్పరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అలారుదిన్నె బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. కడ్డీలు తేలి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు భయంభయంతో ప్రయాణం చేస్తున్నారు. కర్నూలు నుంచి బళ్లారి వైపు ఈ బ్రిడ్జి మీదుగానే వాహనాలు వెళ్తున్నాయి. 40అడుగుల ఎత్తులో హంద్రీ వాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని అప్పట్లో చేపట్టారు. గతంలో ఈ బ్రిడ్జి అనేక ప్రమాదాలు జరిగాయని వలగొండ, పుటకలమర్రి, ముత్తుకూరు, అలారుదిన్నె, కైరుప్పల, ఆస్పరి, దేవనకొండ మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. రెండు మూడు చోట్ల రంధ్రాలు పడడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వదిలేశారు. ప్రస్తుతం బ్రిడ్జి సిమెంట్ ప్యాకింగ్ లేచిపోయి కడ్డీలు తేలి రంధ్రాలు పడ్డాయి. బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సీసీరోడ్డు వేస్తున్న దృశ్యం

తుగ్గలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని జి.ఎర్రగుడిలో రూ.5లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో శ్యాంబాబు నిధులు మంజూరు చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వెంకటస్వామి ఉన్నారు.

జీరో సర్వీస్‌తో అంతర్ యాజమాన్య బదిలీలు చేపట్టాలి: ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్టీయూ పట్టణ అధ్యక్షుడు రవి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మునిసిపల్ పాఠశాలల్లో కార్పొరేషన్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీరో సర్వీస్‌తో అంతర్ జిల్లా బదిలీలకు అవకాశం ఇవ్వాలని ఎస్టీయూ పట్టణ అధ్యక్షుడు రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయులకు స్పౌజ్, మ్యూచువల్ కేటగిరిలో బదిలీలకు అనుమతించడం హర్షిస్తున్నారు. రాష్ట్రంలోని మునిసిపాల్ పాఠశాలలు, మునిసిపాల్ కార్పొరేషన్ పాఠశాలలు, గ్రేటర్ విశాఖ, విజయవాడ కార్పొరేషన్ పాఠశాలలు ఒకే మేనేజ్మెంట్ అనగా మునిసిపల్ మేనేజ్మెంట్ పరిధిలో ఉన్నాయన్నారు. అందువల్ల అంతర్ జిల్లా బదిలీలు కూడా ఒక జిల్లా నుంచి ఇతర పురపాలక శాఖ ఉత్తర్వులు జీవో నెంబర్ 507, తేదీ16/5/2013 మాదిరిగా ఈ బదిలీలు వర్తింప చేసే విధంగా అనుమతించాలని కోరారు. బదిలీ చట్టం-2025 ప్రకారం జూన్‌లో జిల్లా స్థాయి బదిలీలు సందర్భంగా మునిసిపాలిటీ, నగరపాలక సంస్థ, గ్రేటర్ విశాఖ, విజయవాడ పరిధిలో మాత్రమే నిర్వహించారన్నారు. ప్రస్తుతం అంతర్ జిల్లా బదిలీలు సందర్భంగా ఒక రెవెన్యూ జిల్లా పరిధిలోని మునిసిపల్, నగరపాలక సంస్థలోని ఖాళీలకు కూడా స్పౌజ్, మ్యూచువల్ బదిలీలు చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు, లోక్యానాయక్, ఉరుకుందప్ప, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : డివిజనల్ లెవల్ పంచాయతీ కార్యాలయం అద్దె వాహనం వినియోగానికి అనాధికారికంగా డబ్బులు డ్రా చేశామన్న ఆరోపణలు అవాస్తవమని డీఎల్‌పీవోలు నూర్జహాన్, తిమ్మక్క పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ ముందడుగు వేదిక జిల్లా అధ్యక్షుడు దేశాయ్ చంద్రన్న, స.హచట్టం కార్యకర్తలు శాంతకుమార్ తో పాటు మరికొందరు అవాస్తవమైన ఆరోపణలు చేశారన్నారు. 2017 ఏప్రిల్ నుంచి 2024 నవంబర్ వరకు అద్దె వాహనం వివరాలు చెల్లింపులు కోరగా ఆ వివరాలు 8 ఏళ్లలో కేవలం ఒక నెల రూ. 20,770 మాత్రమే సీపీఆర్‌అండ్ ఆర్‌డీ ద్వారా అద్దె వాహనాల వినియోగం కోసం బడ్జెట్ కేటాయింపు జరిగినట్లు సమాచారం ఇచ్చామన్నారు. నియమ నిబంధలను మేరకే ఖర్చు పెట్టామన్నారు. రూ. 20,770లకు గాను అనాధికారికంగా వాహనానికి రూ. 20లక్షలు డ్రా చేశామన్న ఆరోపణల్లో నిజం లేదని తెలిపారు.

దోమకాటుతో జాగ్రత్త

తుగ్గలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం వల్ల జరిగే దోమల కాటుతో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు అమర్నాథ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన తుగ్గలి వైద్యశాలలో ఆయన రోగులతో మాట్లాడుతూ దోమ కాటు వల్ల విషజ్వరాలు వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు వ్యాప్తి చెందుతాయని, దోమలు వృద్ధి చెందకుండా మనల్ని మనం రక్షించుకోవడానికి దోమతెరలు వాడాలని తెలిపారు. మన చుట్టూ పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే వేస్ట్ ఆయిల్, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచనలు చేశారు.

తెర్నేకల్‌లో 21 మందికి టీచర్ ఉద్యోగాలు

దేవనకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తెర్నేకల్ గ్రామానికి చెందిన 21 మంది డీఎస్సీ మెరిట్ లిస్టులో అర్హత సాధించారు. వీరిలో 17 మంది ఎస్జీటీ పోస్టులు ఒకరు పీఈటీ, మరో ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిని గ్రామస్థులు అభినందించారు. తమ తల్లిందడ్రులు కష్టపడి చదివించారని, వారి కష్టం వృథా కాలేదని వారు అన్నారు. బోయ గోమారి తేజేశ్వరి ఎస్‌జీటిలో 88.28, ప్రేమ్‌కుమార్ 84.70, పాసెద్దుల శ్రీలత 83.40, బాపుల దొడ్డి వీరేష్ 82.04, మొగతాలి పరిమల జ్యోతి 80.71, బాపులదొడ్డి రంగస్వామి 80.39, మంగళి తేజ 80.30, ఎరుకుల అనసూయ 80.08, కొండగేరి రంగస్వామి 79.05, కురువ రాజశేఖర్ 78.50, బోయ కవిత 78.07, కనుకు మోనేశ్వరి 77.21, తరగం సుకన్య 77.18, బాటమీది ప్రసాద్ 77.08, మంచాల కిరణ్‌కుమార్ 76.22, పైఇంటి నాగవేణి 75.38, మాదిగ నాగన్న 75.38, సూజారి రోజా 75.12 మార్కులు సాధించారు.

ఒకే అభ్యర్థికి మూడు పోస్టులు



కురువ వెంకటేశ్వర్లు

ఆలూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఫలితాల్లో ఆలూరు మండలం హులేబీడు గ్రామానికి చెందిన కురువ వెంకటేశ్వర్లు మూడు పోస్టుల్లో ర్యాంక్ సాధించాడు. టీజీటీ తెలుగులో 6వ ర్యాంక్, స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 15వ ర్యాంక్, పీజీటీ తెలుగులో 19వ ర్యాంక్‌లు లభించాయి. ఎంఏ తెలుగు పూర్తి చేసి తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న ఆయన డీఎస్సీ కోసం శ్రమించారు. రెండోసారి డీఎస్సీ రాసి ప్రతిభ కనబరిచాడు. స్కూల్ అసిస్టెంట్‌కు ఆప్షన్ ఇస్తానని తెలిపారు. ఉపాధ్యాయుడు కావాలనే తన కోరిక నెరవేరిందన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

ఆలూరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహబూబ్ బాషా అన్నారు. ఆదివారం స్థానిక కొట్టాలగేరీ, చెరువు కట్ట వద్ద, సంత మార్కెట్‌కు వెళ్లే దారిలో ఎస్ఐ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కర్ణాటక మద్యం, నాటుసారా విక్రయిస్తే కేసులు నమో దు చేస్తామన్నారు. బస్టాండు, హోటళ్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో బీడీలు, సిగరెట్లు కాల్చినా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న మిరప పంట



తురువగల్లులో దెబ్బతిన్న మిరప పంట

ఆస్పరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురువగల్లు గ్రామానికి చెందిన రైతు రాంబాబుకు మిరప పంట భారీ వర్షాలకు దెబ్బతింది. గత పది రోజుల క్రితం ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు చేతికొస్తున్న సమయంలో మిరప పంట మట్టిపాలైంది. రాంబాబు ఎకరన్న పొలంలో రూ.లక్షన్నర పెట్టుబడి పెట్టి మిరప పంటను సాగు చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

ఆలూరు మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ బదిలీ

ఆలూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ రాఘవరావు పల్నాడు జిల్లా కళ్లగుంట మోడల్ స్కూల్‌కు బదిలీ అయ్యారు. ప్రభుత్వం చేపట్టిన అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా ఆయన బదిలీపై వెళ్లారు. శనివారం ఆయన రిలీవ్ అయ్యారు. కొత్త ప్రిన్సిపాల్ నియామకం అయ్యేవరకు వైస్ ప్రిన్సిపాల్ వీరేష్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగనున్నారు.

యువత ఉపాధి వైపు అడుగులు వేయాలి

ఆలూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):నిరుద్యోగ యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని ఆలూరు టీడీపీ నాయకురాలు వైకుంఠం జ్యోతి సూచించారు. ఆదివారం ఆలూరు పట్టణంలో మంజు ఏర్పాటు చేసిన డీజే మ్యూజిక్ సెంటర్‌ను ఆమె ఆరంభించారు. విద్యార్హతను బట్టి ఉద్యోగం కోసం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు ప్రకాష్, రహమాన్, విశ్వ పాల్గొన్నారు.

జిల్లా రథసారథి ఎవరు?

5వ పేజీ తరువాయి

త్రిసభ్య కమిటీ సభ్యులు వీరే:

కర్నూలు పార్లమెంట్ పార్టీ కమిటీ ఎంపిక కోసం రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, హిందూపురం ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబును త్రీమెన్ కమిటీ సభ్యులుగా నియమించారు. వీరు మంగళవారం జిల్లాకు రానున్నారు. ముఖ్య నాయకుల సమావేశంలో అధ్యక్ష, జిల్లా కార్యవర్గం ఎంపికపై ముఖ్య నాయకుల అభిప్రాయాలు తీసుకుంటారు. ముందుగా అధినేత చంద్రబాబు సందేశాన్ని వినిపిస్తారు.

దిశా నిర్దేశం: పార్లమెంట్ పార్టీ (జిల్లా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కార్యనిర్వహణ కార్యదర్శులు, సహా పార్టీ అనుబంధ సంఘాల కార్యవర్గం ఎంపిక కోసం అధిష్ఠానం త్రిసభ్య కమిటీ సభ్యులను నియమించింది. ఆ కమిటీ సభ్యులు మంగళవారం ఎంపీ, ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో భేటీ అవుతారు. అయితే.. పార్లమెంట్ కమిటీ ఎంపికపై త్రిసభ్య కమిటీ సభ్యులకు అధినేత, సీఎం చంద్రబాబు ఇప్పటికే సూచనలు చేశారు. మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు ఎంపికైన కమిటీలు సహా సమగ్ర వివరాలతో అధిష్ఠానానికి పంపుతారు. త్రీమెన్ కమిటీ ప్రతిపాదించిన పార్లమెంట్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కమిటీ, అనుబంధ కమిటీలను అధినేత, యువనేతలు పరిశీలన తరువాత వచ్చే నెల 3న జిల్లా అధ్యక్ష, కార్యవర్గం సహా అనుబంధ సంఘాల కార్యవర్గాను అధిష్ఠానం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

ఆశావహుల్లో ఉత్కంఠ: కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా పి.తిక్కారెడ్డి ప్రస్తుతం కొనసాగుతున్నారు. గత ఎన్నికల ముందు మంత్రాలయం టీడీపీ టికెట్ ఆశించారు. అయితే.. సామాజిక, రాజకీయ సమీకరణాలు దృష్ట్యా వాల్మీకి సామాజికవర్గానికి చెందిన మాధవరం ఎన్.రాఘవేంద్ర రెడ్డికి ఇచ్చారు. తిక్కారెడ్డిని బుజ్జగించేందుకు టీడీపీ జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చారు. ఆయన సారథ్యంలోనే ఎన్నికలు నిర్వహించారు. తాజాగా టీడీపీ అధ్యక్షుడిగా తిక్కారెడ్డినే కొనసాగిస్తారా..? కొత్తవారికి చాన్స్ ఇస్తారా..? ఆ పార్టీలో ప్రధానంగా చర్చ జరుగుతోంది. టీడీపీ అధ్యక్ష పీఠం కోసం ఆశావహుల్లో 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆదోని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, టీడీపీ కర్నూలు సిటీ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఆకెపోగు ప్రభాకర్, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు, న్యాయవాది కేఈ జగదీష్‌గౌడ్, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ వాహిద్ హుస్సేన్ ఉన్నారు. ఇప్పటికే నామినేటెడ్ పదవులు ఇచ్చిన వారికి పార్టీ పదవులు ఇవ్వని పక్షంలో ఇతరులకు ఎవరికి అవకాశం వస్తుందోనని చర్చించుకుంటున్నారు.

34 మందితో జిల్లా కార్యవర్గం: టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి సహా ఉపాధ్యక్షులు-7, కార్యదర్శులు-7, ఆర్గనైజింగ్ కార్యదర్శులు-7, అధికార ప్రతినిధులు-7 మీడియా కో-ఆర్డినేటర్, సోషియల్ మీడియా కో-ఆర్డినేటర్.. ఇలా 34 మందితో టీడీపీ జిల్లా కమిటీ ఎంపిక చేస్తారు. అలాగే.. 17 అనుబంధ విభాగాలకు ఒక్కో విభాగంలో 28 మందితో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. వీరితో పాటు 54 సాధికార కమిటీలు ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీల్లో 14 మంది సభ్యులు చొప్పున ఉంటారు. అంటే.. టీడీపీ జెండా మోసే కీలకమైన కార్యకర్తలకు పార్టీ పదవులు దక్కే అవకాశం ఉంది. అలాగే.. పార్టీ పదవుల్లో క్లస్టర్ ఇన్‌చార్జిలకు ప్రాధాన్యత ఉంటుందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు.

కాంగ్రెస్‌తోనే మైనార్టీల అభివృద్ధి



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు అమన్

ఆదోని టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని మైనార్టీ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని ఆ పార్టీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు పీ. అమన్ అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం ఆదోని వచ్చిన ఆయన మాట్లాడుతూ మైనారిటీలతో పాటు దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారన్నారు. 28న విజయవాడలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో రాష్ట్ర మైనారిటీ సభలో జరిగే మహా సభలో అనేక తీర్మానాలను చేయడం జరుగుతుందని, జిల్లాలోని ప్రతి నియోజక వర్గం నుంచి మైనారిటీలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆదోని, ఎమ్మిగనూరు పార్టీ ఇన్‌చార్జి రమేష్ యాదవ్, ఖాసీం వలి, పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, మాజీ కౌన్సిలర్ దిలీప్ ధోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీరావు, మాజీ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు నూర్ అహమ్మద్, వీరేష్, శ్రీనిత్ రాయల్ పాల్గొన్నారు.

గణేశ్ మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

తుగ్గలి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గణేశ్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుల అనుమతులు తప్పనిసరి తీసుకోవాలని తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐలు బాల నరసింహులు, మల్లికార్జున తెలిపారు. ఆదివారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐలు మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, మండపాలు ఏర్పాటు చేసుకునేవారు ఆన్‌లైన్‌లో ఆంధ్రప్రదేశ్ పోలీస్ వెబ్‌సైట్, గణేశ్ ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పోలీసు పర్మిషన్ ఇచ్చిన పేపరును గణేశ్ మండపాల వద్ద ల్యామినేషన్ చేసి ఉంచాలన్నారు. పోలీసులు మండపాలను సందర్శించిన సమయంలో ఆన్‌లైన్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అప్రూవల్ చేస్తారన్నారు. తుగ్గలి, జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో 29న వినాయక నిమజ్జనం చేసుకోవాలన్నారు.

దేవనకొండ: వినాయక ఉత్సవ వేడుకల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వంశీనాథ్ హెచ్చరించారు. గ్రామాల్లో వినాయక విగ్రహాలు పెట్టేవారు అనుమతులు తీసుకోవాలన్నారు. వినాయక వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

రేపు వీరభద్రేశ్వర స్వామి ఉత్సవాలు

ఆదోని టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పొలిమేరలోని పేట వీరభద్ర స్వామి ఉత్సవం 26న నిర్వహిస్తున్నట్లు ఆల్కూరు మఠం మహర్షి సిద్ధాలింగయ్య స్వామి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, జంగమ అర్చక సమాఖ్య సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, పల్లకి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉందని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను చేశామని తెలిపారు.

శిథిలావస్థలో చెక్‌డ్యాం



దెబ్బతిన్న చెక్‌డ్యాం

దేవనకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె. వెంకటాలపురం వద్ద సుకాలినాగమ్మ ఆలయం వద్ద ఉన్న చెక్‌డ్యాం శిథిలమైంది. దీంతో వర్షపునీరు నిల్వ ఉండకుండా కిందకు వృథాగా పోతుందని రైతులు పేర్కొంటున్నారు. గత పది రోజుల కింద కురిసిన భారీ వర్షాలు కురిసినా చుక్కనీరు లేదన్నారు. ప్రభుత్వం స్పందించి చెక్‌డ్యాంకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


రోడ్డుపైనే మురుగు

దేవనకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతపల్లి ఎస్సీ కాలనీ వద్ద రహదారిపైనే మురుగు, వర్షపునీరు నిల్వ ఉంటుంది. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రహదారి మధ్యలోనే మురుగు ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపైనే నిలిచిన మురుగు

తీగలు మార్చారు.. స్తంభాన్ని మరిచారు..



మద్దికెర ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండు వద్ద విద్యుత్ స్తంభం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండేది. స్థానికుల ఫిర్యాదు మేరకు స్తంభాన్ని, ట్రాన్స్‌ఫార్మర్‌ను, తీగలను పక్కనపెట్టారు. అయితే.. స్తంభాన్ని మాత్రం తొలగించకుండా అలాగే వదిలేశారు. దీంతో నడిరోడ్డుపై ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్ అధికారులు స్పందించి రోడ్డుపైఉన్న స్తంభాన్ని తొలగించాలని, ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను కూడా తీసేయాలని కోరారు. విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ మాట్లాడుతూ విద్యుత్ స్తంభాన్ని, దిమ్మెను వెంటనే తొలగిస్తామని తెలిపారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ



మృతుడి కుమారుడికి ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

కౌతాళం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా టీడీపీ నిలుస్తోందని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్పగౌడ్ అన్నారు. ఆదివారం మండల టీడీపీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని హల్వి గ్రామంలో రెండు నెలల క్రితం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రాజశేఖర స్వామి ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం పై నుంచి పడి మృతి చెందాడు. అతనికి చంద్రన్న బీమాతో పాటు టీడీపీ సభ్యత్వం ఉండటంతో ఈ విషయాన్ని అప్పట్లో మంత్రాలయం టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్ర రెడ్డి దృష్టికి మండల అధ్యక్షుడు ఉలిగయ్య తీసుకుపోవడంతో వారు విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకుపోగా పార్టీ చంద్రన్న ప్రమాద బీమా కింద రూ.5లక్షలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మొత్తం చెక్కును ఆదివారం ఇంచార్జి కుమారుడు రాకేష్ రెడ్డి మృతుని భార్య మంజుళ, కుమారుడు సిద్దేశకు గ్రామ నాయకులతో కలిసి రూ.5లక్షల చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిన్న సిద్దయ్య, సతీష్ నాయుడు, కురువ నాగేష్, పక్కీరయ్య, గోపాల్, హనుమంతు, స్వామి ఉన్నారు.

నేడు దళిత, బహుజన ఐక్యతా ప్రదర్శన



మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ కదిరికోట ఆదెన్న

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ భవన నిర్మాణం కోరకు, బాబు జగ్జీవన్ విగ్రహా ఏర్పాటుకై 25వ తేదిన దళిత, బహుజన ఐక్యతా ప్రదర్శన కార్యక్రమం చేపడుతున్నట్లు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భవన సాధన కమిటీ చైర్మన్ కదిరికోట ఆదెన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏళ్ల తరబడి నిలిపోయిన డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం రూ 2కోట్ల నిధులు మంజూరు చేయాలని, భారత మాజీ ఉప ప్రధాని స్వాతంత్ర్యసమరయోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటుకై ఉదయం 10గంటలకు తహాసీల్దార్ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు దళిత, బహుజనులతో ర్యాలీగా ఐక్యతా ప్రదర్శన చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాల, మాదిగ, బేడ, బుడగజంగాలు, ఎరుకల, మైనార్టీలు, దళిత క్రైస్తవులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

ఎమ్మిగనూరు,ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని పంపన్న గౌడ్ కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు మోజేస్ ఇంట్లో ఆదివారం తెల్లవారు జామున దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళలాలు పగలగొట్టి బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారు నగలు, 25 తులాల వెండి ఆభరణాలుతో పాటు స్కూటిని ఎత్తుకెళ్లారు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. పంపన్న గౌడ్ కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు మోజేస్ జూన్ నెలలో ఇంటికి తాళం వేసి లండన్‌లో ఉంటున్న తన పెద్ద కుమారుడు దగ్గరకు భార్యభర్తలు వెళ్లారు. చిన్న కుమారుడు ఇంటి పైభాగంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం ఉదయం పనిమనిషి చిన్నకుమారుడు ఇంటికి వస్తు కింద ఉన్న ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి పైన ఉన్న చిన్నకుమారుడు ప్రవీణ్‌కు సమాచారం ఇచ్చింది. దీంతో కిందకు వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి లోపలికు వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటం, సామాన్లు చెల్లా చెదురుగా పడిఉండటంతో ఇంట్లో చోరి జరిగిందని తెలుసుకొని పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి దొంగతనం జరిగిన వివరాలను సేకరించారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

గోనెగండ్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని భక్తులు ప్రశాంతంగా జరుపుకోవాలని గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ కోరారు. ఆదివారం ఆయన మండలంలోని పలు గ్రామాల పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లర్లకు పాల్పడితే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జన కార్యక్రమానికి చిన్నపిల్లలను తీసుకెళితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య స్వామి, పలు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

నందవరం: గ్రామాల్లో వినాయక చవితి పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ కేశవ కోరారు. ఆదివారం మండలంలోని మాచాపురం, ఇబ్రహింపురం, హలహర్వి, నదికైరవాడి గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వినాయక ప్రతిష్ట రోజుకు ముందే వినాయక మండలి కమిటీ పోలీసేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. అలాగే మండపాల దగ్గర విద్యుత్ అధికారుల అనుమతితో ప్రతిష్టించే మండపాల దగ్గరకు కరెంట్ లాగుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీపీ తాలుకా అధ్యక్షుడు నదికైరవాడి వీరేష్, మాచాపురం సర్పంచ్ కోటేశ్వరరావు, ఇబ్రహింపురం గాలెప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

ఎమ్మిగనూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి ఫారం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంత్రాలయానికి చెందిన రాజేష్, మహబూబ్‌కు తీవ్రమైన గాయాలు అయ్యాయి. మంత్రాలయానికి చెందిన రాజేష్, మహబూబ్‌లు మోటర్ సైకిల్ పై ఆదోనికి వెళ్లి తిరిగి మంత్రాలయానికి వస్తుండగా బనవాసి ఫారం సమీపంలో ఉన్న సీఎల్ఆర్‌సీ భవనం దగ్గర ఎమ్మిగనూరు నుంచి ఆదోని వైపు వెలుతున్న కారు మోటర్ సైకిల్‌ను ఢీ కొనడంతో రాజేష్, మహబుబ్‌లకు తీవ్రగాయాలు అయ్యాయి. అయితే ప్రమాదానికి కారణమైన కారు నిలపకుండ ఆదోని వైపు వెళ్లిపోయారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది వారిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం కర్నూలు తరలిచారు. రూరల్ పోలీసు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి: కాంగ్రెస్

ఎమ్మిగనూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో పలు ప్రాంతాల్లో ఉన్న రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జి కాశీం వలీ అధికారులను కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ఎద్దుల మార్కెట్ రోడ్డు, మైనార్టీ కాలనీ రోడ్డు, హెచ్‌బీఎస్ కాలనీ రోడ్డు, గాయత్రి మాతా ఆలయం రోడ్డు, మాలపల్లి రోడ్డుతో పాటు పలు చోట్ల రోడ్లు దెబ్బతిని పూర్తిగా గుంతలమయంగా మారాయన్నారు. వెంటనే పట్టణంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు



స్వర్ణ రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథం పై విహరించారు. భాద్రపద పాడ్యమి తొలిరోజుని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు, విద్యుత్ దీపాల మధ్య స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఊంజల సేవ నిర్వహించారు. మఠం పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం విజయవాడ సీబీఐ స్పెషల్ జడ్జి గజనన్ భట్ ఆదివారం రాత్రి మంత్రాలయానికి వచ్చారు. సోమవారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకోనున్నారు. అదే విధంగా కర్నూలుకు చెందిన ప్రముఖ వైద్యులు కేజీ గోవిదరెడ్డి, జీఆర్ చంద్రశేఖర్, నరసింహన్‌కు మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి ఘనంగా స్వాగతం పలికారు. వీరి వెంట సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ పాల్గొన్నారు.

పీఠాధిపతికి తులాభారం: రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులకు హుబ్లీ కి చెందిన అపరంజి కుటుంబ సభ్యులు ప్రముఖ ధార్వాడ నేతి మిఠాయిలతో తులాభారం చేశారు

బ్యాటరీ వాహనాల విరాళం : శ్రీమఠానికి బెంగళూరుకు చెందిన ఎంఎస్ రామయ్య ఫౌండేషన్ అనిత పట్టాభిరామ్ గతంలో 2 వాహనాలు ఇవ్వగా ఆదివారం మరొక వాహనాన్ని ఇచ్చారు. కర్ణాటకకు చెందిన మరో భక్తుడు బ్యాటరీ ట్రాలీ వాహనాన్ని విరాళం ఇచ్చారు. వీటికి పీఠాధిపతి పూజలుచేసి ప్రారంభించారు. వీటిని పరిమళ ప్రసాద రవాణాకు వినియోగిస్తున్నట్లు పీఠాధిపతి తెలిపారు.

జిల్లా రథసారథి ఎవరు?

5వ పేజీ తరువాయి

త్రిసభ్య కమిటీ సభ్యులు వీరే:
కర్నూలు పార్లమెంట్ పార్టీ కమిటీ ఎంపిక కోసం రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, హిందూపురం ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబును త్రీమెన్ కమిటీ సభ్యులుగా నియమించారు. వీరు మంగళవారం జిల్లాకు రానున్నారు. ముఖ్య నాయకుల సమావేశంలో అధ్యక్ష, జిల్లా కార్యవర్గం ఎంపికపై ముఖ్య నాయకుల అభిప్రాయాలు తీసుకుంటారు. ముందుగా అధినేత చంద్రబాబు సందేశాన్ని వినిపిస్తారు.

దిశా నిర్దేశం:
పార్లమెంట్ పార్టీ (జిల్లా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కార్యనిర్వహణ కార్యదర్శులు, సహా పార్టీ అనుబంధ సంఘాల కార్యవర్గం ఎంపిక కోసం అధిష్ఠానం త్రిసభ్య కమిటీ సభ్యులను నియమించింది. ఆ కమిటీ సభ్యులు మంగళవారం ఎంపీ, ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో భేటీ అవుతారు. అయితే.. పార్లమెంట్ కమిటీ ఎంపికపై త్రిసభ్య కమిటీ సభ్యులకు అధినేత, సీఎం చంద్రబాబు ఇప్పటికే సూచనలు చేశారు. మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు ఎంపికైన కమిటీలు సహా సమగ్ర వివరాలతో అధిష్ఠానానికి పంపుతారు. త్రీమెన్ కమిటీ ప్రతిపాదించిన పార్లమెంట్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కమిటీ, అనుబంధ కమిటీలను అధినేత, యువనేతలు పరిశీలన తరువాత వచ్చే నెల 3న జిల్లా అధ్యక్ష, కార్యవర్గం సహా అనుబంధ సంఘాల కార్యవర్గాను అధిష్ఠానం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

ఆశావహుల్లో ఉత్కంఠ
కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా పి.తిక్కారెడ్డి ప్రస్తుతం కొనసాగుతున్నారు. గత ఎన్నికల ముందు మంత్రాలయం టీడీపీ టికెట్ ఆశించారు. అయితే.. సామాజిక, రాజకీయ సమీకరణాలు దృష్ట్యా వాల్మీకి సామాజికవర్గానికి చెందిన మాధవరం ఎన్.రాఘవేంద్రరెడ్డికి ఇచ్చారు. తిక్కారెడ్డిని బుజ్జగించేందుకు టీడీపీ జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చారు. ఆయన సారథ్యంలోనే ఎన్నికలు నిర్వహించారు. తాజాగా టీడీపీ అధ్యక్షుడిగా తిక్కారెడ్డినే కొనసాగిస్తారా..? కొత్తవారికి చాన్స్ ఇస్తారా..? ఆ పార్టీలో ప్రధానంగా చర్చ జరుగుతోంది. టీడీపీ అధ్యక్ష పీఠం కోసం ఆశావహుల్లో 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆదోని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, టీడీపీ కర్నూలు సిటీ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఆకెపోగు ప్రభాకర్, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు, న్యాయవాది కేఈ జగదీష్‌గౌడ్, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ వాహిద్ హుస్సేన్ ఉన్నారు. ఇప్పటికే నామినేటెడ్ పదవులు ఇచ్చిన వారికి పార్టీ పదవులు ఇవ్వని పక్షంలో ఇతరులకు ఎవరికి అవకాశం వస్తుందోనని చర్చించుకుంటున్నారు.

34 మందితో జిల్లా కార్యవర్గం
టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి సహా ఉపాధ్యక్షులు-7, కార్యదర్శులు-7, ఆర్గనైజింగ్ కార్యదర్శులు-7, అధికార ప్రతినిధులు-7 మీడియా కో-ఆర్డినేటర్, సోషియల్ మీడియా కో-ఆర్డినేటర్.. ఇలా 34 మందితో టీడీపీ జిల్లా కమిటీ ఎంపిక చేస్తారు. అలాగే.. 17 అనుబంధ విభాగాలకు ఒక్కో విభాగంలో 28 మందితో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. వీరితో పాటు 54 సాధికార కమిటీలు ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీల్లో 14 మంది సభ్యులు చొప్పున ఉంటారు. అంటే.. టీడీపీ జెండా మోసే కీలకమైన కార్యకర్తలకు పార్టీ పదవులు దక్కే అవకాశం ఉంది. అలాగే.. పార్టీ పదవుల్లో క్లస్టర్ ఇన్‌చార్జిలకు ప్రాధాన్యత ఉంటుందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు.

శ్రీమద్ భాగవత ప్రవచనం ప్రారంభం



ప్రవచనాలు చేస్తున్న విజయేంద్రాచార్

మంత్రాలయం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి సన్నిధానంలో శ్రీమద్ భాగవతం ప్రవచనాల కార్యక్రమాన్ని మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ప్రారంభించారు. ఆదివారం యాగశాలలో వెండి ఊయలలో రాఘవేంద్రస్వామి ప్రతిమను ఉంచి పీఠాధిపతి హారతులు ఇచ్చి ఈ నెల 24 నుంచి 30 వరకు జరిగే భాగవతాన్ని ప్రారంభించారు. మైసూరు చెందిన ప్రముఖ విధ్వాన్ విజయేంద్రాచార్ భాగవతంలోని ప్రధాన ఘట్టాల ప్రవచనాలను వినిపించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత పండిత కేసరి విధ్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, ద్వారపాలక అనంతస్వామి, వాషేంద్రాచార్, తంబిస్వామి, అచ్చుత్‌రావు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ



రైతు వేలిముద్రలను తీసుకుంటున్న వ్యవసాయాధికారులు

కౌతాళం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పరిధిలోని బాపురం పంచాయతీ గ్రామ రైతులకు ఆదివారం వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు ఈ-పోస్ యంత్రము ద్వార యూరియాను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మండలలో యూరియా కొరత ఉండటంతో రైతులు సాగు చేసిన పంటలకు సకాలంలో ఎరువులను వేసేందుకు యూరియా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవడంతో వారు బాపురం గ్రామానికి రెండులోడ్‌ల యూరియాను అందించినట్లు తెలిపారు. గ్రామం కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో యూరియా పక్క రాష్ట్రానికి తరలిపోకుండా వ్యవసాయాధికారులు ఈ-పోస్ యంత్రం ద్వార రైతుల వేలిముద్రలు తీసుకుని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శేషాద్రి, సీఐ అశోక్ కుమార్, రైతులు ఉన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ సారథి జమ్మన్న



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి

కోసిగి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమ సారథి అవినీతి అధికారుల పాలిట సింహస్వప్నం కామ్రేడ్ జమ్మన్న సంస్మరణ సభ ఏపీటీఎఫ్ కర్నూలు జిల్లా కమిటి ఆధ్వర్యంలో కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా కామ్రేడ్ జమ్మన్న చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షులు రఘురామయ్య నివాలలర్పించారు. అక్షరశాతంలో వెనుకబడిన కోసిగిలో విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత, క్రమశిక్షణలో కృషి చేసి నేటికి జమ్మన్న పేరు ఒక బ్రాండ్‌గా ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భానుమూర్తి, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండు రంగ వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, నంద్యాల జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి, జి రంగన్న, శివయ్య, నారాయణ, ఓబులేసు, నాయకులు పాల్గొన్నారు.

వాహనాలపై విరిగిపడిన చెట్టు

మంత్రాలయం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఆర్టీసీ బస్టాండు వద్ద పొడుగాటి చెట్టు ఉన్నట్టుండి విరిగి పడింది. దీంతో ప్రమాదం తృటిలో తప్పింది. ఆదివారం రద్దీగా ఉన్న ఈ ప్రదేశంలో చెట్టు ఒక్కసారిగా విరిగి పడింది. ఆ సమయానికి భక్తులు, ప్రయాణికులు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే పార్కింగ్ చేసిన వాహనాలపై పడింది. దీంతో వాహనాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. భక్తులు ఎవరికీ గాయాలు కాకపోవడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

సమయపాలన లేని బస్సులు.. ఆటోలే దిక్కు



ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు

● చింతకుంట విద్యార్థుల ఇబ్బందులు

కోసిగి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతకుంట, పల్లెపాడు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించకపోవడంతో ఆ గ్రామాల విద్యార్థులకు ఆటోలే దిక్కయ్యాయి. ఆర్టీసీ బస్సులు బడి సమయ వేళలకు లేకపోవడంతో కోసిగిలో ఆటో స్టాండ్ల వద్ద చింతకుంట, పల్లెపాడు విద్యార్థులు రోజూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదకర స్థితిలో ఆటోల టాపులైన ,ఆటోల వెనుకాల నిల్చుని ప్రయాణాలు చేస్తున్నారు. ఆటోలలో పరిమితికి మించి రాను, పోనూ ప్రయాణాలు చేస్తుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో నుంచి విద్యార్థులకు బడి సమయవేళలకు ఉదయం, సాయంత్రం ఆర్టీసీ సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పంట పొలాల్లో గుర్రాల విధ్వంసం

గోనెగండ్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లోని పంట పొలాల పై గుర్రాలు దాడుల చేస్తున్నాయి. రాత్రి రైతులు పొలం నుంచి ఇంటికి వచ్చిన తరువాత గుర్రాలు గుంపు పంట పొలాలపై పడుతోంది. పంటను మొత్తం తినివేయడం, పీకి వేయడం ద్వారా పంట పూర్తిగా ధ్వంసం అవుతోంది. దీంతో రైతులు నష్టాలపాలు కావాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలుతీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా ప్రమాణ స్వీకారం

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బ్రాహ్మణుల నూతన జిల్లా కమిటీ ప్రమాణస్వీకారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఓస్కూల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ముఖ్య అతిధులు బీజేపీ నాయకులు గురురాజ్‌దేశాయ్, రాష్ట్ర కార్యదర్శి దేశాయ్ కృష్ణమూర్తిలు మాట్లాడుతూ జిల్లాలో, నియోజకవర్గాలలో కమిటీలను ఏర్పాటు చేసి బ్రాహ్మణులను ఐక్యతగా తీసుకువస్తామని అన్నారు. ప్రభుత్వం మ్యానిఫెస్టోలో బ్రాహ్మణులకు ఇచ్చిన 11 అంశాలలో ఇప్పటి వరకు మూడు మాత్రమే నెరవేర్చారని మిగిలిన అంశాలు కూడా త్వరగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని అధికార ప్రతినిధిగా దేశాయ్ గురురాజ్ రావు, జిల్లా అధ్యక్షుడిగా వెంకటరామరాజు, ప్రధాన కార్యదర్శిగా కాశీ ప్రసాద్, కొశాధికారిగా కరణం వసంతకుమార్‌లు ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆదమరిస్తే.. అంతే



మంత్రాలయం ప్రధాన రహదారిలో గోతిపడిన దృశ్యం

మంత్రాలయం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వస్తున్న భక్తులు రోడ్డు పై ఆదమరిస్తే అంతే సంగతులే. మంత్రాలయంలోని ప్రధాన రహదారి పక్కన పెద్ద గోతి పడింది. ఈ రోడ్డులో ఆటోలు, వాహనాలు, కార్లు, ద్విచక్రవాహనాలుతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అలాంటి ప్రాంతాల్లో గుంత పడి దాదాపు పది రోజులు కావస్తున్నా ఇటు పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే పెద్ద నష్టమే జరుగుతుందని భక్తులు, గ్రామస్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఆ గుంతను పూడ్చాలని, ప్రయాణీకులకు, భక్తులకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు జరిగేలా చూడాలని కోరుతున్నారు.

చేనేతలను ఆదుకోవాలి: మాజీ ఎంపీ



చేనేతల కష్టాలు తెలుసుకుంటున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు పట్టణంలో అకాల వర్షాలు వలన నష్టపోయిన చేనేత కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ ఇంచార్జి బుట్టా రేణుక, సీనియర్ నాయకులు నీలకంఠ మాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం చేనేత ఇళ్ళకు వెళ్ళి వారి పరిస్థితి చూసి అనంతరం వారు మాట్లాడుతూ ఇటివల కురిసిన వర్షాల కారణంగా చేనేతలు ఏర్పాటు చేసుకున్న మగ్గాల గుంతలలో వర్షపు నీరు చేరి ముడి సరుకు తడిచిపోయి, పనులు లేక నష్టపోయిన తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్న చేనేత కార్మికులను అదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రఘు, పట్టణ ఉపాధ్యక్షుడు కొటకొండ నరసింహులు, పట్టణ బీసి సెల్ అధ్యక్షుడు జజారి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగిలో మెరిసిన ఆణిముత్యాలు

కోసిగి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అక్షరాస్యతలో చిట్టచివరి నుంచి రెండో స్థానంలో ఉంది కోసిగి మండలం. ఇలాంటి మండలం నుంచి 7వ వార్డు సిద్దప్పపాలెం చెందిన ముకుంద కృష్ణమూర్తి, పద్మావతి దంపతుల మొదటి కుమార్తె ముకుంద సువర్ణ డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీలో 87.06 మార్కులు సాదించి ఉత్తమ ర్యాంకు కనబరిచి ఓపెన్ కేటగిరిలోనే టీచర్ అర్హత సాధించింది. టెట్ ఫలితాల్లో 146.89 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచింది. నిన్న విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో కూడా 87 మార్కులు సాధించి ఉత్తమ ర్యాంకుతో ఓపెన్ కేటగిరిలోనే సువర్ణా అవకాశం సాధించింది. ఈ సందర్భంగా టీచర్ ఉద్యోగం సాదించిన సువర్ణ మాట్లాడుతూ తన తల్లిదండ్రులు ముకుంద కృష్ణమూర్తి, పద్మావతి, చిన్నాన్న నర్సారెడ్డి, భర్త రామాంజనేయులు సహకారంతో తన రెండు నెలల కుమారుడు ఉన్నప్పటికీ పట్టుదలతో చదివి ఉపాధ్యాయ అర్హత సాధించాననీ సంతోషం వ్యక్తం చేశారు. టెట్ ఫలితాల్లో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించాననీ, నవంబరు 4, 2024లో ఆంధ్రజ్యోతిలో సువర్ణావకాశం అనే కథనంలో భాగంగా ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ డీఎస్సీలో ఖచ్చితంగా సాదిస్తాననీ, కోసిగి మండలంలో అక్షరాస్యతను పెంచేందుకు కృషి చేస్తాననీ, నా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, భర్త రామాంజనేయులు సహకారంతోనే ఉద్యోగం సాదించాననీ, అలాగే కర్నూలులోని కోచింగ్ సెంటర్ యాజమన్యం సహకారం కూడా ఉందని ఆమె తెలిపారు.



దంపతులు శివకుమార్, యశోద



సువర్ణ

ఆర్లబండలో దంపతులకు ఉద్యోగాలు
ఆర్లబండ గ్రామానికి చెందిన పూజారి ఆర్లబండ శివకుమార్ స్కూల్ అసిస్టెంట్‌లో 74.97 మార్కులు 69వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అలాగే ఆయన భార్య సైతం తమ్మలి యశోద ఎస్‌జీటీలో 78.77 మార్కులతో టీచర్‌గా అర్హత సాధించింది. ఒకే ఇంట్లో భార్య భర్తలు మొదటి ప్రయత్నంలోనే భర్త స్కూల్ అసిస్టెంట్, భార్య ఎస్‌జీటీ పోస్టులు సాధించడంతో వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భార్యభర్తలిద్దరూ డీఎస్సీలో ఉత్తమ ర్యాంకులు సాదించి టీచర్ పోస్టుకు ఎంపిక కావడంతో ఆర్లబండ , కోసిగి మండల ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు

ఎమ్మిగనూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో మరమ్మతులకు గురై వెలగని వీధి దీపాలకు మున్సిపల్ సిబ్బంది ఆదివారం మరమ్మతులు చేశారు. పట్టణంలో ఆయా ప్రధాన రహదారుల్లో వెలగని వీధి దీపాలను గుర్తించిన ఇంజనీరింగ్ సిబ్బంది కమిషనర్ గంగిరెడ్డి ఆదేశాల మేరకు మరమ్మతులు చేశారు. పార్కురోడ్డు, బస్టాండ్, సోమప్ప సర్కిల్‌తో పాటు ఆయా ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేసి వెలిగేలా చేశారు.